విశాఖపట్టణం
ఆదివారం 19 జులై 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com  సంపుటి: 9  సంచిక:176  వెల: రూ.5/-  పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో పతనం

ఈజ్ ఆఫ్ డూయింగ్ రియల్ ఎస్టేట్ బిజినెస్ లో బాబు నెంబర్ వన్

కూటమి పాలన ఒక ఈవెంట్ మేనేజ్‌మెంట్

వైయస్. జగన్ తెచ్చిన ప్రాజెక్టులకే చంద్రబాబు పబ్లిసిటీ

మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ ధ్వజం



2




### ఉత్తమ తెలుగు చిత్రం

## కమిటీ కుర్రాళ్లు

**కల్కి 2898ఏడీ, పుష్ప2, దేవర, లక్కీ భాస్కర్ లకు అవార్డులు**

**2024 సంవత్సరానికిగాను ప్రకటన**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

72వ నేషనల్ ఫిలిం అవార్డ్స్ విన్నర్స్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024కు సంబంధించి అవార్డులను ప్రకటించింది కేంద్రం. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన నటులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలతో సత్కరించనున్నారు. సౌత్ నుంచి ఇంట్రస్టింగ్ సినిమాలో పోటి పడుతున్నారు. టాలీవుడ్ నుంచి కల్కి 2898 ఏడీ, పుష్ప 2, దేవర, లక్కీ భాస్కర్, 35 చిన్న కథ కాదు, క సినిమాలు రేసులో ఉన్నాయి. తాజాగా ప్రకటించిన అవార్డులలో బెస్ట్ ఫిలిం క్రిటిక్ సంజీవ్ శ్రీవాత్స ( హిందీ), బెస్ట్ బుక్ ఆన్ సినిమా కన్నడ సినిమాడ తత్వ మత్తు రాజకీయ (కన్నడ బుక్) కెంచనూరు ప్రదీప్ కుమార్ శెట్టి అవార్డులు అందుకున్నారు.

**విజేతలు వీరే..**

బెస్ట్ ఫిల్మ్ క్రిటిక్ -- సంజీవ్ శ్రీవాస్తవ (హిందీ)
బెస్ట్ సినిమాటోగ్రఫీ -- లైవ్ ఇన్ లూమ్
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరి: బెస్ట్ స్క్రిప్ట్-ఓబుర్
బెస్ట్ డైరెక్షన్ -- ఆనంద్రాయ్ (స్టాట్యూ ఆఫ్ యూనిటీ)
బెస్ట్ డాక్యుమెంటరీ -- రామ్ నమీ

..మిగతా 2లో

# ఆ నోర్లను ఫినాయిల్ వేసి క్లీన్ చేసారు

## చెత్తను ఎన్నికల్లో ప్రజలే తుడిచేసారు



ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు

రౌడీయిజం, ఫ్యాక్షనిజం చేస్తే సహించం

లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు రాజీ లేని పోరాటం

ఇంతటి అరాచక రాజకీయాలను ఎన్నడూ చూడలేదు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు

గుడివాడలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రకు హాజరు



(కృష్ణ జిల్లా - జయజయహే)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని కీలక నియోజకవర్గమైన గుడివాడ వేదికగా విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రౌడీయిజం, ఫ్యాక్షనిజం చేస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు అని సీఎం కరాఖండిగా హెచ్చరించారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనను గొడ్డలి పార్టీ రాజకీయంగా అభివర్ణించిన చంద్రబాబు, కొందరు నేతలు క్రిమినల్స్‌గా మారి ప్రజల జీవితాలతో ఆడుకున్నారని, మాజీ మంత్రి కొడుకు చేసిన కారు ప్రమాదంలో ఒక ప్రాణం పోయినా అప్పటి ప్రభుత్వం స్పందించిన తీరే అందుకు నిదర్శనమని ధ్వజమెత్తారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఇలాంటి దారుణమైన దోపిడీ, అరాచక రాజకీయాలను ఎప్పుడూ చూడలేదన్నారు. గత ఎన్నికల్లో కొంత మంది నేతల నోర్లను ఫినాయిల్ వేసి క్లీన్ చేశారని చంద్రబాబు కొడాలినానిని ఉద్దేశించి పరోక్షంగా కీలక వ్యాఖ్యలు చేశారు. మొన్న ఎన్నికల్లో చాలా వరకు చెత్తను ప్రజలే క్లీన్ చేశారు. ఆ నోర్లు ఏం నోరులో నాకు అర్థం కాలేదు. ఆ నోర్లన్నీ ఫినాయిల్‌తో శుభ్రం చేశారు. ఇంకా అక్కడక్కడ చెత్త వాసనలు ఉన్నాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబంపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. అడిగితే ఇది మా స్వేచ్ఛ అంటున్నారు అని మండిపడ్డారు.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల ..మిగతా 2లో

## మహిళపై అమానుష దాడిపై సీరియస్

**వివస్త్రను చేసిన నిందితుడుపై క్రిమినల్ కేసు... సీఎం చంద్రబాబు కన్నెర్ర**

3

# ఆగస్టు 1న భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభం

ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం


చరిత్రలో నిలిచేలా ప్రారంభోత్సవం జరగాలి

భోగాపురం ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం

పోర్టులు, హైవేలు, పరిశ్రమలు, ఎయిర్పోర్ట్స్, టూరిజం ప్రాజెక్టులతో ఉత్తరాంధ్ర ఇక అన్ స్టాపబుల్

ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, కళలను చాటేలా అత్యంత కళాత్మకంగా ప్రతి విభాగం ఉండాలి

భోగాపురం విమానశ్రయంపై సమీక్షలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు




(అమరావతి - జయజయహే)

భోగాపురం ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్ట్ ఉత్తరాంధ్రకు మణిహారంగా మారుతుందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కొత్త ఎయిర్ పోర్టు ఆ ప్రాంత స్థితిగతులను మార్చేస్తుందని సీఎం వ్యాఖ్యానించారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆగస్టు 1వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ మేరకు ప్రధాని షెడ్యూల్ ఖరారు అయ్యింది. 2014లో నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో మొదలైన భోగాపురం ఎయిర్ పోర్టు పనులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసి...రెండేళ్ల కాలంలో పూర్తి చేసింది. సర్వాంగ సుందరంగా తయారైన భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఎయిర్ పోర్టు ప్రారంభ కార్యక్రమంపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష చేశారు. సమీక్షకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి ..మిగతా 2లో



## పోలవరంలో విషాదం

**చేపల వేటకు వెళ్లిన మునిగిన మత్స్యకారులు**

**ఆరుగురు వ్యక్తుల మృత్యువాత**

(పోలవరం - జయజయహే)

పోలవరం జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లిన ఐదుగురు వ్యక్తులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర ఉదంతం జిల్లాలోని ఎటపాక మండలం గొల్లగూడెం గ్రామ సమీపంలో జరిగింది. ప్రాథమిక వివరాల ప్రకారం.... ..మిగతా 2లో




## దూసుకెళ్లిన విక్రమ్-1

**చారిత్రిక ప్రయోగం సక్సెస్**

**అంతరిక్ష పరిశోధనలో సరికొత్త అధ్యాయం**

**ప్రశంసించిన ప్రధాని నరేంద్ర మోడీ**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

భారతదేశ అంతరిక్ష పరిశోధన చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది! దేశీయ ప్రైవేట్ అంతరిక్ష రంగానికి సరికొత్త రెక్కలు తొడుగుతూ.. ప్రముఖ స్పేస్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' రూపొందించిన 'విక్రమ్-1' రాకెట్ ఆదివారం నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి మధ్యాహ్నం 12:05 గంటలకు ఈ చారిత్రాత్మక ప్రయోగం జరిగింది. 'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ తొలి ఆర్బిటల్ టెస్ట్ ఫ్లైట్, భారతీయ ప్రైవేట్ రంగాన్ని అంతర్జాతీయ శాటిలైట్ లాంచ్ మార్కెట్లో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు మొదటి అడుగుగా నిలిచింది. భారత అంతరిక్ష పితామహుడు ..మిగతా 2లో

### బూతులు తిడిదే

## అది అశ్లీలత కాదు

**క్రిమినల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోలేం**

**లైంగికంగా ప్రేరేపించేలా ఉంటేనే చర్యలు**

**తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు**



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

కోపంలోనో, గొడవల్లోనో వాడే తిట్లు, అసభ్య పదజాలం లేదా బూతులు ఎంత అసహ్యకరంగా ఉన్నప్పటికీ, వాటిని క్రిమినల్ చట్టం ప్రకారం నేరుగా అశ్లీలత కింద పరిగణించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒక మాటను అశ్లీలంగా భావించాలంటే దానికి చట్టపరమైన నిర్దిష్ట ప్రమాణాలు ఉండాలని, అది వినేవారిని లైంగికంగా ప్రేరేపించేలా లేదా దిగజార్చేలా ఉంటేనే ఆ సెక్షన్ వర్తిస్తుందని కోర్టు తెలిపింది. తమిళనాడుకు చెందిన మణి అనే వ్యక్తి దాఖలు చేసిన అప్పీల్‌ను పాక్షికంగా అనుమతిస్తూ జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ విపుల్ ఎమ్. పాంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. 2017 ఆగస్టులో తమిళనాడులో జరిగిన ఒక వ్యవసాయ భూమి వివాదంలో మణి అనే వ్యక్తి తన ప్రత్యర్థులను అత్యంత అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా కొడవలితో దాడి చేసి ఒకరి ముక్కు ఎముక విరిగేలా చేశాడు. ఈ కేసులో ట్రయల్ కోర్టు అతనికి ఐపీసీ సెక్షన్ 294(బి) (అశ్లీలత), 326 (తీవ్రమైన గాయం చేయడం), 506(ఖఖ) (క్రిమినల్ బెదిరింపు), ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద శిక్ష విధించింది. మద్రాస్ ..మిగతా 2లో

### మహిళను వివస్త్రను చేసి

## కొట్టడం సిగ్గుచేటు



గుంటూరు సిటీ ఘటన అత్యంత హేయం

కూటమి పాలనలో వరుసగా దారుణాలు

సభ్య సమాజం తలదించుకునే ఘటనలు

హోంమంత్రి అనిత తక్షణం రాజీనామా చేయాలి

సీఎం చంద్రబాబు బహిరంగ క్షమాపణలు చెప్పాలి

వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి డిమాండ్

(విశాఖపట్నం - జయజయహే)

గుంటూరు నగరంలో టీడీపీ నాయకుడు ఒక మహిళను వివస్త్రను చేసి వేధించిన ఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, దీనికి బాధ్యత వహిస్తూ హోంమంత్రి అనిత తన పదవికి రాజీనామా చేయాలని, సీఎం చంద్రబాబు మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి డిమాండ్ చేశారు. విశాఖపట్నంలోని వైయస్సార్‌సీపీ సిటీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ 15వ తేదీ దారుణం జరిగితే బాధితురాలి ఫిర్యాదును పోలీసులు పట్టించుకోలేదని, సాక్షి మీడియా ద్వారా ..మిగతా 2లో

# 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో పతనం

### మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ ధ్వజం

(విశాఖపట్నం - జయజయహే)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని, పారిశ్రామిక ప్రగతిని పూర్తిగా గాలికొదిలేసిందని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విశాఖపట్నం వైయస్సార్సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... గత 25 మాసాలుగా ఈ ప్రభుత్వం కేవలం ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లు, తప్పుడు ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని అమర్నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ హయాంలో దేశంలోనే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో వరుసగా నాలుగు సార్లు నంబర్ వన్ స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్‌ను, ప్రస్తుత కూటమి ప్రభుత్వం తమ చేతకానితనంతో 8వ స్థానానికి దిగజార్చిందని మండిపడ్డారు. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు భద్రత కరువైందని, శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాల్సింది పోయి, విశాఖపట్నం, అమరావతిలలో విలువైన ప్రభుత్వ భూములను తమ బినామీలకు కారుచౌకగా కట్టబెడుతూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ రియల్ ఎస్టేట్ బిజినెస్', 'ఈజ్ ఆఫ్ డూయింగ్ కరప్షన్'లలో ఈ ప్రభుత్వం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 25 మాసాలు దాటినా ప్రజలకు చేసిన మేలు ఒక్కటి కూడా లేదు. ఇచ్చిన హామీల అమలూ లేదు, పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలూ లేవు. కొత్త పెట్టుబడులు అసలే లేవు. గత ప్రభుత్వంలో వైఎస్. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెచ్చిన ప్రాజెక్టులకు మళ్లీ శంకుస్థాపనలు చేయడం, మేము పూర్తి చేసిన ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు చేస్తూ తామే తెచ్చినట్టు పబ్లిసిటీ చేసుకోవడమే ఈ 25 మాసాలుగా చూస్తున్నాం. రాష్ట్రానికి మంచి చేసే విధంగా, సంపద సృష్టించే విధంగా ఎక్కడా ఎటువంటి కార్యాచరణ లేదు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ నిన్న నీతి ఆయోగ్ విడుదల చేసిన రిపోర్ట్.



'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఆంధ్రప్రదేశ్ ఈరోజు 8వ స్థానానికి పడిపోయింది. 2019-24 మధ్య వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, కోవిడ్ లాంటి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే వరుసగా నాలుగు సార్లు నంబర్ వన్ స్థానంలో నిలిచింది. బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్ కింద ఎప్పుడు ర్యాంకులు ప్రకటించినా నంబర్ వన్ గా ఉన్న రాష్ట్రాన్ని ఈరోజు ఎనిమిదో స్థానానికి దిగజార్చారు. అయినా సరే, భజన మీడియా సాయంతో 1 కంటే 8 పెద్ద నంబర్ కదా, కాబట్టి కూటమి ప్రభుత్వమే గొప్పదంటూ ప్రచారం చేసుకునే సిగ్గుమాలిన స్థితికి దిగజారారు. గతంలో 2018-19 కంటే ముందు ప్రభుత్వాలు ఇచ్చిన రిపోర్ట్స్ ని బేస్ చేసుకొని ర్యాంకింగ్స్ ఇచ్చేవారు. కానీ 2018-19 తర్వాత వాళ్ళు ఇంటర్నల్ గా సర్వే చేసుకొని, పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడి దారులతో మాట్లాడి, వాళ్ళు ఇచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా తీసుకొని ర్యాంకింగ్స్ ఇచ్చే పద్ధతి వచ్చింది. ఈరోజు ఆ పద్ధతి వచ్చినప్పుడు, నువ్వు ఒకటి నుంచి ఎనిమిది పడిపోతే, నువ్వు ఏం గొప్పలు చెప్తావ్? అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు ఈరోజు దేశంలో దేంట్లో నంబర్ వన్ గా ఉన్నారు అంటే అది 'ఈజ్ ఆఫ్ డూయింగ్ రియల్ ఎస్టేట్ బిజినెస్', 'ఈజ్ ఆఫ్ డూయింగ్ కరప్షన్' (అవినీతి) లోనే. ఆయన కొడుకు లోకేష్ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అంటారు.. కానీ అది బిజినెస్ కాదు, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ కరప్షన్'లో ఆయన నంబర్ వన్. సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ లు ప్రపంచ యాత్రికుల్లా రెండు సంవత్సరాలలో మూడు సార్లు సింగపూర్, రెండు సార్లు దావోస్, దుబాయ్, యూకే, అమెరికా, సౌత్ కొరియా అంటూ దేశాలు తిరుగుతున్నారు తప్ప రాష్ట్రానికి ఒక్క రూపాయి పెట్టుబడి కూడా రాలేదు. నిన్న మాజీ ముఖ్యమంత్రి, మా పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్ భీమవరంలో అక్వా రైతుల సదస్సుకు వెళ్తే, అక్కడ వేలాది మంది జనం వచ్చారు. దాదాపు 200 మంది పోలీసులు ఉన్నా, పైనుంచి వచ్చిన ఆదేశాల వల్ల వారు కేవలం బొమ్మల్లా నిలబడ్డారే తప్ప జగన్ కి ఇవ్వాల్సిన 'జెడ్ ప్లస్' కేటగిరీ సెక్యూరిటీ బాధ్యతలను నిర్వహించలేదు. నేను స్వయంగా అక్కడే ఉండి చూశాను. మాజీ ముఖ్యమంత్రి భద్రతపైనే ఇంత అశ్రద్ధ వహిస్తున్న ఈ ప్రభుత్వం సామాన్యులకు, మహిళలకు ఏం రక్షణ ఇస్తుంది? ఆయనకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు? ఒకవేళ కూటమి ప్రభుత్వం చేస్తున్న ఈ కుట్రల వల్ల వైయస్. జగన్ ఒంటి మీద చిన్న గీత పడినా కూటమి నేతల తలరాతలు మారిపోతాయి. వైయస్.జగన్ రోడ్డెక్కితే మేం భద్రత ఇవ్వం అని చెప్పండి, ఆయనను కాపాడుకోవడానికి లక్షలాది మంది కార్యకర్తలు, కోట్లాది మంది అభిమానులు సిద్ధంగా ఉన్నారు అని గుడివాడ అమర్ హెచ్చరించారు.

# దూసుకెళ్లిన విక్రమ్-1

మొదటి పేజీ తరువాయి...




డాక్టర్ విక్రమ్ సారాభాయ్ స్మృత్యర్థం ఈ రాకెట్‌కు 'విక్రమ్' అని పేరు పెట్టడం విశేషం. వాస్తవానికి తొలుత ఉదయం 11:30 నిమిషాలకు విక్రమ్-1 టేకాఫ్ జరగాల్సి ఉంది. చివరి నిమిషంలో వాయిదా పడింది. మళ్లీ టేకాఫ్ ఎప్పుడు ఉంటుంది? అని సర్వత్రా ఉత్కంఠ నెలకొన్న సమయంలో.. కాస్త ఆలస్యంగా, మధ్యాహ్నం 12:30కి విక్రమ్-1 నింగిలోకి దూసుకెళ్లింది. విక్రమ్-1 మోసుకెళ్తున్న పేలోడ్స్‌లో అత్యంత కీలకమైంది 'ఎంబ్రేస్' మిషన్. అంతరిక్షంలో ప్రమాదకరంగా మారుతున్న శకలాలు, వ్యర్థాలను తొలగించడానికి భవిష్యత్తులో ఉపయోగపడే రోబోటిక్ ఆర్మ్ సాంకేతికతను ఈ ప్రయోగం ద్వారా పరీక్షించనున్నారు. ఒక ప్రైవేట్ రాకెట్ ద్వారా ఈ తరహా ప్రయోగం జరగడం దేశంలోనే ప్రథమం. ఈ మిషన్‌లో ఒక ప్రత్యేకమైన మైక్రో ఆర్ట్ ట్రిబ్యూట్‌ని కూడా అంతరిక్షంలోకి పంపుతున్నారు. 18 క్యారెట్ల బంగారంతో చేసిన ఒక సూక్ష్మ రాకెట్‌లో భారతదేశ శాస్త్ర సాంకేతిక రంగాల మూలస్తంభాలైన డాక్టర్ విక్రమ్ సారాభాయ్, సర్ సీవీ రామన్, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంల సూక్ష్మ విగ్రహాలను ఉంచారు. ఇది సైన్స్, జాతీయ వారసత్వాల అద్భుత కలయిక. కళాత్మక ప్రదర్శనలో భాగంగా, ల్యాబ్‌లో కృత్రిమంగా తయారు చేసిన 'కాస్మిక్ బ్లూమ్' అనే వజ్రాన్ని ఈ రాకెట్ ద్వారా అంతరిక్ష కక్ష్యలోకి పంపుతున్నారు. వ్యాపారపరమైన అంతరిక్ష ప్రయోగాలకు సృజనాత్మకతను జోడించవచ్చని ఈ మిషన్ నిరూపిస్తోంది.

**ప్రధాని మోదీ దేశభక్తి సందేశం అంతరిక్షంలోకి..**

'మిషన్ ఆగమన్' ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంపిన శుభాకాంక్షల సందేశాన్ని రాకెట్ అంతరిక్షంలోకి తీసుకెళ్తోంది. 'వందేమాతరం' అనే నినాదంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వందలాది మంది మద్దతుదారుల అభినందనల కార్డును కూడా ఈ రాకెట్ మోసుకెళ్లనుంది. ఇది భారతదేశ విస్తరిస్తున్న అంతరిక్ష ఆకాంక్షలను దేశ పౌరుల ఆశయాలతో అనుసంధానించేలా ప్రదర్శించనున్నారు.

### ఆగస్టు 1న భోగాపురం

# ఎయిర్ పోర్ట్ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి...

నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, సిఎస్ సాయిప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో పాటు ఉన్నతాధికారులు, మంత్రులు సత్యకుమార్, అచ్చెన్నాయుడు, అనితతో పాటు పలువురు పాల్గొన్నారు. సమీక్షకు హాజరైన ఏవియేషన్ శాఖ అధికారులు, ఎయిర్ పోర్టు నిర్మించిన జిఎంఆర్ సంస్థ ప్రతినిధులు భోగాపురం ఎయిర్పోర్టులో నిర్మాణ వివరాలు, వసతులు, సౌకర్యాలను వివరించారు. ఎయిర్ పోర్టు కార్యకలాపాలు ప్రారంభించడానికి అవసరమైన 8 కీలక అనుమతులు ఇప్పటికే పొందినట్లు వివరించిన అధికారులు వివరించారు.

**ఉత్తరాంధ్ర ఇక అన్ స్టాపబుల్**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్ పోర్టు కీలకం కానుంది. సామాన్యుల జీవితాలను మార్చే విధంగా ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్రలో కొత్త అవకాశాలను తీసుకువస్తుంది. ఎకనమిక్ యాక్టివిటీ ఉరుకులు పెడుతుంది. రాకపోకలు మొదలయ్యాక ఆ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మారుతాయి. సామాన్యులు కూడా అనేక రకాలుగా లబ్ది పొందుతారు. రవాణా మాత్రమే కాకుండా...టూరిజం, పారిశ్రామికపరంగా కూడా ఈ ప్రాంత అభివృద్ధికి ఈ ఎయిర్ పోర్టు ఉపయోగపడుతుంది. విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో ఈ ఎయిర్ పోర్టు కీలక పాత్ర పోషిస్తుంది. హైదరాబాద్‌లో వచ్చిన శంషాబాద్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు ఆ ప్రాంతంలో ఎటువంటి మార్పులు తెచ్చిందో నేడు భోగాపురంతో ఆ ప్రాంతంలోనూ అటువంటి మార్పులే తెస్తుంది. ఎకనమిక్ యాక్టివిటీ పెరిగి అన్ని వర్గాలకు ఉద్యోగ, ఉపాధి అవకశాలు కలుగుతాయి. సంపద సృష్టికి అవకాశం ఏర్పడుతుంది. సాగునీటి ప్రాజెక్టులు, హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుంది... రానున్న రోజుల్లో ఉత్తరాంధ్ర అన్‌స్టాపబుల్" అని సీఎం చంద్రబాబు అన్నారు.

**ప్రతి పౌరుడు, ప్రతి కుటుంబం సెలబ్రేట్ చేసుకోవాలి**

"ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, కళలను చాటేలా అత్యంత కళాత్మకంగా ఎయిర్ పోర్టులో ప్రతి విభాగాన్ని తీర్చిదిద్దాలి. ప్రధాని చేతుల మీదు జరిగే ప్రారంభోత్సవం చరిత్రలో నిలిచిపోవాలి. గిరిజన సంస్కృతి, హస్తకళలు గుర్తు చేసేలా స్వాగత కార్యక్రమం ఉండాలి. భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభాన్ని ఉత్తరాంధ్రలోని ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడు సెలబ్రేట్ చేసుకోవాల్సిన శుభ సందర్భం. ప్రతి పౌరుడూ ఎయిర్ పోర్టును చూసి గర్వించే పరిస్థితి రావాలి. ఉత్తరాంధ్రలో దీన్ని పండుగలా చేసేలా ప్రజలను, విద్యార్థులను, యువతను భాగస్వాములను చేయాలి"అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# ఆ నోర్లను ఫినాయిల్ వేసి క్లీన్ చేసారు


మొదటి పేజీ తరువాయి...

సమగ్ర వికాసమే లక్ష్యంగా గుడివాడ సభలో సీఎం చంద్రబాబు పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అమృత్ 2.0 ఏఐయూడీఎఫ్ అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించడంతో పాటు, పారిశుధ్య నిర్వహణలో అద్భుత ప్రతిభ కనబరిచిన స్వర్ణ పంచాయతీ ఉద్యోగులకు, కార్మికులకు స్వచ్ఛ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కాలుష్యం మానవ ఆరోగ్యంపై చూపుతున్న ముప్పును ప్రస్తావిస్తూ, రాబోయే అక్టోబర్ 2వ తేదీ నాటికి ఆంధ్రప్రదేశ్‌ను చెత్త లేని రాష్ట్రం గా మార్చడమే తమ ప్రభుత్వ సంకల్పమని ప్రకటించారు. ప్రతి కుటుంబం ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేరు చేస్తూ, తడి చెత్తను కంపోస్ట్‌గా మార్చుకునే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసే ప్రతిష్టాత్మక తల్లికి వందనం పథకం సొమ్మును ఈ నెలలోనే విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కేవలం సాధారణ వర్గాలకే కాకుండా, సమాజ సేవలో నిరంతరం శ్రమిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగస్వాములైన కార్మికుల కుటుంబాలకు కూడా ఈ 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించి మహిళా లోకానికి పెద్ద భరోసానిచ్చారు. సంక్షేమం, సంస్కరణలు సమాంతరంగా నడుస్తాయనేందుకు తమ ప్రభుత్వమే నిదర్శనమన్నారు.

వ్యవసాయ, నీటిపారుదల రంగానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తుంటే అనేకమంది అడ్డుపడ్డారని, కానీ తాము పట్టుబట్టి 12 నెలల్లోనే దానిని పూర్తి చేసి కృష్ణా డెల్టాను కరువవకుండా కాపాడామని చెప్పారు. పట్టిసీమ ద్వారా ఇప్పటివరకు 450 టీఎంసీల గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు తరలించిన రికార్డు తమదేనన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం సర్వనాశనం చేసిందని మండిపడ్డ భౌగోళిక వ్యూహకర్త చంద్రబాబు, ఇప్పుడు పనులను మళ్లీ వేగవంతం చేశామని, 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును వంద శాతం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తానని సవాల్ విసిరారు. రాష్ట్రంలోని నదులన్నింటినీ అనుసంధానం చేయడమే తమ అంతిమ లక్ష్యమన్నారు. ప్రస్తుతం గ్లోబల్ క్లైమేట్ చేంజ్, ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు లేక పంటలు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేసిన సీఎం, ఇటువంటి విపత్కర పరిస్థితులను తట్టుకోవడానికే తాము ముందుచూపుతో పర్యావరణ హిత ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తీవ్ర సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగానికి పూర్తి సబ్సిడీలు, మద్దతు ఇచ్చి అండగా ఉంటామని, అలాగే పొగాకు పండించే రైతుల కష్టాలను కూడా తీరుస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

# పోలవరంలో విషాదం

మొదటి పేజీ తరువాయి...




గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు చేపల వేట కోసం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలోకి దిగారు. అయితే... ఆ ప్రాంతంలో నది లోతు ఎక్కువగా ఉండటంతో ప్రవాహ ఉధృతికి వారంతా ఒక్కసారిగా నీటిలో మునిగి గల్లంతయ్యారు. నీటిలో మునిగిపోవడంతో ఊపిరాడక ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు మరియు సహాయక సిబ్బంది తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. నదిలో మునిగిపోయిన ఐదు మృతదేహాలను సిబ్బంది బయటకు వెలికితీశారు. మృతులలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నట్లు ధృవీకరించారు. వీరంతా గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన ఒకే ప్రాంతం వారు కావడంతో ఆ గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. చేపల వేటకు వెళ్లిన వారు శవాలై ఇంటికి రావడంతో మృతుల కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. ఒకేరోజు... ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు అనుకోని రీతిలో ప్రాణాలు కోల్పోవడంతో గొమ్ముకొత్తగూడెంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘోర ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు ప్రారంభించారు.

**వైఎస్ జగన్ దిగ్భ్రాంతి...**

గోదావరిలో ఐదుగురు గిరిజనుల మృతి మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉండటం హృదయవిదారకమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే అండగా నిలిచి, తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



### ఉత్తమ తెలుగు చిత్రం

# కమిటీ కుర్రాళ్లు

మొదటి పేజీ తరువాయి...

బెస్ట్ తెలుగు ఫిలిం : కమిటీ కుర్రోళ్ళు
జాతీయ ఉత్తమ చిత్రం బెస్ట్ ఫీచర్ ఫిలిం: ఆర్టికల్ 370, డైరెక్టర్ ఆదిత్య సుహాస్
జాతీయ ఉత్తమ నటి : యామీ గౌతమ్ -- ఆర్టికల్ 370
బెస్ట్ యాక్టర్ : కార్తీక్ ఆర్యన్ , సినిమా చందు ఛాంపియన్.
బెస్ట్ డైరెక్టర్: అమరన్ -- డైరెక్టర్ రాజ్ కుమార్ పెరిసామి
బెస్ట్ చిల్డ్రన్స్ ఫిలిం: చిన్న కథ కాదు -- డైరెక్టర్ నందకిషోర్ ఈమని
బెస్ట్ పాపులర్ ఫిలిం : కల్కి 2898 ఏడి , డైరెక్టర్ నాగ్ అశ్విన్
బెస్ట్ తెలుగు ఫిలిం : కమిటీ కుర్రోళ్ళు- డైరెక్టర్: యదు వంశీ
బెస్ట్ మేకప్: కమిటీ కుర్రోళ్ళు , మేకప్ ఆర్టిస్ట్ రవికుమార్
బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్ పుష్ప 2 , కాస్ట్యూమ్ డిజైనర్ దీపాలే నూర్ శీతల్ శర్మ
బెస్ట్ ప్రొడక్షన్ డిజైనర్: కల్కి 2898 నితిన్ జీహాన్ చౌదరి
బెస్ట్ స్క్రీన్ ప్లే డైలాగ్ రైటర్: లక్కీ భాస్కర్ , డైలాగ్ రైటర్ అట్లూరి వెంకీ
బెస్ట్ స్క్రీన్ ప్లే రైటర్: పుష్ప 2- సుకుమార్
బెస్ట్ హిందీ ఫిలిం : శ్రీకాంత్, డైరెక్టర్ తుషార్ హిరానందనీ
బెస్ట్ మ్యూజిక్ డైరెక్షన్: అమరన్, మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాష్ కుమార్
బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ :చిన్న కథ కాదు, చైల్డ్ ఆర్టిస్టు అరుణ్ దేవ్ పోతుల

### బూతులు తిడిదే

# అది అశ్లీలత కాదు

మొదటి పేజీ తరువాయి...

హైకోర్టు ఎస్సీ, ఎస్టీ చట్టం కేసును కొట్టివేసినప్పటికీ.. ఐపీసీ శిక్షలను అలాగే ఉంచడంతో నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

**సుప్రీంకోర్టు ఏం చెప్పింది?**

ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, ఐపీసీ సెక్షన్ 294(బి) కింద అశ్లీలత అనే నేరాన్ని మోపాలంటే కేవలం చెడు మాటలు మాట్లాడితే సరిపోదని స్పష్టం చేసింది. "చట్టప్రకారం అశ్లీలత అనేది కేవలం అసభ్యత లేదా తిట్లకు సమాన అర్థం కాదు. గొడవల సమయంలో వాడే బూతు పదాలు వినడానికి అసహ్యంగా, దిగ్భ్రాంతికరంగా అనిపించవచ్చు. కానీ అవి ఎదుటివారిని మానసికంగా లేదా నైతికంగా దిగజార్చేలా ఉంటేనే అశ్లీలత అవుతుంది. అంతేకాకుండా ఆ మాటల వల్ల పబ్లిక్ స్థలంలో ఇతరులకు ఇబ్బంది కలిగిందనే రుజువు కూడా ఉండాలి. ప్రస్తుత కేసులో నిందితుడు తిట్టిన తిట్లు కేవలం కోపంలో అన్నవే కానీ అవి చట్ట పరిధిలోని అశ్లీలత కిందికి రావు" అని అభిప్రాయపడింది. ఇదే ప్రాతిపదికన గొడవ పడేటప్పుడు వాడే హెచ్చరికలన్నీ క్రిమినల్ బెదిరింపుల కిందకు రావంటూ సెక్షన్ 506(అఅ) శిక్షను కూడా కోర్టు రద్దు చేసింది. బూతులు, బెదిరింపుల సెక్షన్లను కొట్టేసినప్పటికీ.. నిందితుడు కొడవలితో దాడి చేసి బాధితుడి ముక్కు ఎముకను విరగ్గొట్టినట్లు మెడికల్ రిపోర్టులలో స్పష్టంగా రుజువైంది. అందువల్ల సెక్షన్ 326 కింద నిందితుడి నేరాన్ని కోర్టు సమర్థించింది. అయితే ఈ వివాదం భూమి గొడవల వల్ల జరిగిందని, ప్రస్తుతం నిందితుడి వయస్సు దాదాపు 70 ఏళ్లు దాటడం, అతని ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు శిక్షను తగ్గించింది. కోర్టు సమయం ముగిసేవరకు జైలు శిక్ష విధిస్తూ, రూ. 50,000 జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఈ మొత్తాన్ని రెండు నెలల్లోగా చెల్లించాల్సి ఉంటుంది.

### మహిళను వివస్త్రను చేసి

# కొట్టడం సిగ్గుచేటు

మొదటి పేజీ తరువాయి...


బయటి ప్రపంచానికి తెలియబట్టే సీఎం చంద్రబాబు ట్విట్టర్‌లో స్పందించారని గుర్తు చేశారు. ఈ మూడు రోజులు స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి సెటిల్మెంట్ చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. ఒక మహిళకు అన్యాయం జరిగితే సాటి మహిళలుగా హోంమంత్రి, ఎమ్మెల్యే, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మొన్ననే కావలిలో గిరిజన మహిళలను టీడీపీ కౌన్సిలర్ వివస్త్రను చేసి వేధించిన ఘటన మరువకముందే ఇలాంటిదే మరో ఘటన గుంటూరు నగరంలో జరగడం ప్రభుత్వ పనితనానికి అద్దం పడుతోందన్నారు. రాష్ట్రంలో మహిళలపై ఏ దారుణం జరిగినా నిందితులు టీడీపీ నాయకులు, కార్యకర్తలే ఉంటున్నారని.. వారి తప్పులను చూసీచూడనట్టు ప్రభుత్వం వదలేయడం వల్లనే దారుణాలకు అంతులేకుండా పోతుందని వరుదు కళ్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు కూటమి పాలనలో మహిళలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం రోజురోజుకీ సన్నగిల్లిపోతోందని అసహనం వ్యక్తం చేశారు. ఈ దారుణానికి తెగించిన నిందితులతోపాటు పట్టించుకోని పోలీసులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గుంటూరు నగరంలో నీటి బోర్, మోటర్ పంప్ విషయంలో రూ.10 వేల లంచం ఇవ్వలేదన్న కారణంతో, టీడీపీ వార్డు సెక్రటరీ మల్లెల మూర్తి అతని కుటుంబ సభ్యులు కలిసి ఒక మహిళను వివస్త్రను చేసి నడిరోడ్డుపై 10 నిమిషాల పాటు అమానుషంగా దాడి చేయడం సభ్య సమాజం తలదించుకునే సంఘటన. బాధితురాలు భయంతో మూత్రం పోసుకున్నా విడిచిపెట్టకుండా కాళ్లతో తన్ని దాడి చేశారు. మొన్న కావలిలో గిరిజన మహిళపై జరిగిన దాడి మరువకముందే ఈ ఘోరం జరిగిందంటే, కూటమి పాలనలో మహిళలకు బ్రతికే స్వేచ్ఛే లేకుండా పోయింది. ఈ దాడులకు కారణం నిందితులపై ప్రభుత్వం, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమే. 15న ఈ దారుణం జరిగితే, 16న బాధితురాలు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆమె అనుచరులు కేసును సెటిల్ చేయడానికి ప్రయత్నించడం వల్లే మూడు రోజులు జాప్యం జరిగింది. నిన్న 'సాక్షి' మీడియా ఈ అరాచకాన్ని వెలుగులోకి తెచ్చి వీడియోలు వైరల్ అయ్యాక, ప్రజల నుండి వ్యతిరేకత వస్తుందని గ్రహించి ఈరోజు ఉదయం చంద్రబాబు ట్వీట్ చేశారు, ఆ తర్వాతే పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు అని గుర్తు చేసారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా ఫెయిల్ అయింది. ఒక మహిళా హోం మంత్రిగా ఉండి కూడా అనిత శాంతి భద్రతలను కాపాడటంలో విఫలమయ్యారు. కేవలం వీడియో కాల్ పరామర్శలకే పరిమితమవుతున్న ఆమె నైతిక బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలి. అటు మహిళా కమిషన్ కూడా అధికార పార్టీ నేతలపై సుమోటోగా కేసు నమోదు చేయకుండా నిద్రపోతోంది. రాష్ట్రంలో చట్టం, న్యాయం పక్కనపెట్టి 'రెడ్ బుక్ రాజ్యాంగం' నడుపుతున్నారు. ఏపీలో టీడీపీ అంటే 'తెలుగు దుశ్శాసన పార్టీ'గా, 'తెలుగు దుర్మార్గుల పార్టీ'గా మారిపోయింది. కూటమి నేతలైన కోనేటి ఆదిమూలం, అరవ శ్రీధర్, కిరణ్ రాయల్, నజీర్, కొలికిపూడి శ్రీనివాస్ వంటి ప్రజాప్రతినిధులు మహిళలపై వేధింపులకు పాల్పడినా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్లే, క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు భయం లేకుండా పోయింది అని ధ్వజమెత్తారు.

# హైందవ సాంప్రదాయాలతో మానసిక ప్రశాంతత

**బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు**

**చాగంటి ఆశీర్వచనం తీసుకున్న ఎమ్మెల్యే పంచకర్ల**

**విశాఖపట్నం, జూలై 18, జయ జయహే**



పెందుర్తి నియోజకవర్గం జీవీఎంసీ 95 వార్డు చీమలపల్లి సమీపంలోని మీనాక్షి కన్వెన్షన్ హాల్లో ప్రముఖ ఆధ్యాత్మిక సేవా సంస్థ నిర్వహించిన ప్రవచన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశాఖ ఉమ్మడి రూరల్ జిల్లా జనసేన అధ్యక్షుడు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు గారు పాల్గొన్నారు . ఈ సందర్భంగా పూజ్య గురువులు ప్రవచనా చక్రవర్తి వచస్పతి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పూలమాలాంకితులను చేశారు . అలాగే చాగంటి వారి నుండి ఆశీర్వాదం అందుకున్నారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి హైందవ సంప్రదాయాలను పాటించడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గోవులను పూజించడం మన సంస్కృతికి మూలం అని రమేష్ బాబు ఉద్ఘాటించారు. అనంతరం ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గోవు ప్రాధాన్యతను వివరించారు ఈ యొక్క కార్యక్రమానికి పెందుర్తి నియోజకవర్గం నుండి ఆధ్యాత్మిక భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## నగరంలో 50 పార్కుల్లో అభివృద్ధికి ఏర్పాట్లు

**వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్**

**విశాఖపట్నం, జూలై 18, జయ జయహే :**

నగర వాసులు పచ్చదనం ఉండే పార్కుల్లో ఎక్కువ సమయాన్ని గడిపేందుకు ఆసక్తి చూపుతున్నారని, అందువల్ల వీఎంఆర్డీఏ పరిధిలోని అన్ని పార్కుల్లో వాకర్స్ సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించేలా పచ్చదనం పెంపొందించాలని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. శనివారం ఉదయం వీఎంఆర్డీఏ కార్యాలయంలో అటవీశాఖ విభాగ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిధిలో 50 పార్కులను అభివృద్ధి చేసి, పచ్చదనం పెంపొందించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎంవీపీకాలనీలో ఉన్న వీఎంఆర్డీఏ నర్సరీని ప్రైవేటు నర్సరీలతో పోటీ పడేలా అభివృద్ధి చేయాలని, నర్సరీ గురించి విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. నగర పరిధిలో తక్కువ స్థలంలో ఎక్కువ పచ్చదనం పెంపొందించి , అటవీ ప్రాంతంగా తీర్చిదిద్దే మియావాకీ పార్కులను సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రధానంగా వీఎంఆర్డీఏకి చెందిన లేఅవుట్లలో పచ్చదనం పెంపొందించే ఏర్పాట్లు చేయాలన్నారు. బోగాపురం విమానాశ్రయానికి చేరుకునేందుకు వీఎంఆర్డీఏ అభివృద్ధి చేసిన ప్రధాన రహదారుల విభాగిని మధ్యలో పచ్చదనం పెంపొందించేలా ఏపుగా పెరిగే చెట్లను పెంచాలని, ఆకర్షణీయంగా కనిపించేలే చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళీకృష్ణ, డీఎఫఓ ఎ.వి.రమణమూర్తి, ఎఫ్ ఆర్ ఓ శిరీష, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలన

**శ్రీకాళహస్తి జూలై 18, జయ జయహే**

మండలం పరిధిలోని ఊరందూరు రెవెన్యూ పరిధిలోని పంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించి వారితో చర్చించగా "రైతులు గత సంవత్సరం బోర్లలో నీరు సమృద్ధిగా ఉండటం వలన పంట సాగు చేయడం జరిగిందని అదే మాదిరిగా ఈ సంవత్సరం కూడా నీళ్లు సమృద్ధిగా ఉంటాయని ఉద్దేశంతో ముందస్తుగానే మే జూన్ నెలలోనే పంటలు సాగు చేశామని కానీ అనూహ్యంగా బోర్లలో నీరు తగ్గటం వలన పంటలు ఎండుముఖం పట్టాయని తెలియజేయగా ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రధానంగా ఎల్ నిన్ను ఎఫెక్ట్ వలన భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టినందునే నీటి కొరత ఏర్పడిందని తద్వారా రైతులు ఇకనుంచి ఆరుతడులుగా నీళ్లు పెట్టుకోవాలని సూచిస్తూ, తోటి రైతులు నీరు ఇచ్చి ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు (రెగ్యులర్), శ్రీకాళహస్తి , పి. రమేష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రైతు సేవా కేంద్రం సిబ్బంది లావణ్య ఊరందూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టుకు అరుదైన గౌరవం

**రాజమహేంద్రవరం: జయ జయహే :జూలై 18:**



ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ శ్రీరామ్ మూర్తి సివిల్ సప్లై విజిలెన్స్ కమిటీ సభ్యునిగా నియమితులయ్యారు. పాత్రికేయ రంగంలో ఆయనకున్న అనుభవాన్ని, సామాజిక బాధ్యతను గుర్తించిన ప్రభుత్వం ఈ కీలక బాధ్యతను ఆయనకు అప్పగించింది. శ్రీరామ్ మూర్తి నియామకం పట్ల పాత్రికేయ మిత్రులు, శ్రేయోభిలాషులు రాజమహేంద్రవరం నగర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించేందుకు, సామాన్యులకు అందుతున్న సేవలను మరింత మెరుగుపరిచేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ అరుదైన అవకాశం కల్పించిన ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## బాలల గేయ రచన పోటీలకు ఆహ్వానం

**డా. గజల్ శ్రీనివాస్, అధ్యక్షులు**

**ఆంధ్ర సారస్వత పరిషత్తు**

**అమరావతి (జయ జయహే)**




ఆంధ్ర సారస్వత పరిషత్తు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా బాలల కోసం 5,6 డిసెంబర్ 2026 న నెక్స్ట్ జన్ ఇంటర్నేషనల్ స్కూల్, ఒంగోలు ప్రాంగణం లో నిర్వహిస్తున్న నాలుగవ ప్రపంచ తెలుగు మహా సభలు -బాలలు పురస్కరించుకుని బాల సాహిత్యాన్ని పెంపొందించే దిశగా "బాల గేయాల రచన" పోటీలు నిర్వహిస్తున్నట్లు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీలో ఏ వయసు వారైనా పాల్గొనవచ్చని, గేయం 15 పంక్తులు (లైన్లు) మించకుండావుండాలని కోరారు. గేయ రచన తెలుగు భాష , సంస్కృతి, జీవన విధానం, భారతీయత లపై ఆశక్తి, అనురాగం కలిగించే విధంగా వుండాలని తెలియజేశారు. పోటీలకు పంపే గేయాలు వ్రాత ప్రతిని పిడిఎఫ్ మాధ్యమంలో 10 ఆగస్టు 2026 కల్లా కోరుప్రోలు మాధవరావు 9866995085 .నెంబర్ కు వాట్సాప్ ద్వారా పంపాలి..ప్రథమ బహుమతి మూడువేల రూపాయలు, ద్వితీయ బహుమతి రెండువేల రూపాయలు, తృతీయ బహుమతి వేయి రూపాయలు మరియు పది ప్రోత్సాహక బహుమతులు ఒక్కొకటి ఐదువందల రూపాయలు అలాగే ప్రశంసా పత్రము, పతకము మహాసభల సమయంలో విజేతలకు ప్రదానం చేయడం జరుగుతుందని కార్యదర్శి ధవేజీ , ముఖ్య సమన్వయ కర్తలు డా. మురళీధర్ రెడ్డి, కోగంటి శ్రీకాంత్ లు తెలిపారు. ఎన్నిక కాబడిన గేయాలను ధ్వని ముద్రణ చేసి, ఏఐ ద్వారా వీడియో లుగా రూపొందించి ప్రచారం చేస్తామని కార్యక్రమ అంతర్జాతీయ, జాతీయ సమన్వయ కర్తలు కొల్లి రమావతి, రాధికా మంగిపూడి తెలిపారు.

## బీచ్‌లో మద్యం విక్రయాలను ఉపసంహరించుకోవాలి

**జిల్లా పార్టీ అధికార ప్రతినిధి బీఎస్ కృష్ణ**

**విశాఖపట్నం, జూలై 18, జయ జయహే :**



అభివృద్ధి పేరుతో విశాఖ బీచ్‌లను మద్యం విక్రయాల కేంద్రాలుగా మార్చే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని వైసీపీ జిల్లా పార్టీ అధికార ప్రతినిధి బీఎస్ కృష్ణ అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుటుంబాలతో కలిసి ప్రశాంతంగా గడపడానికి వచ్చే వారికి బీచ్‌లలో మద్యం విక్రయాల వల్ల ఇబ్బందులు కలుగుతాయన్నారు. మత్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వడం అభివృద్ధి కాదు, అది విశాఖ సంస్కృతికి విరుద్ధమైన నిర్ణయమని ఆరోపించారు. విశాఖ ప్రజలకు కావాల్సింది పర్యాటక అభివృద్ధి... మద్యం సంస్కృతి కాదని స్పష్టం చేశారు. సంపద సృష్టి పేరుతో బీచ్‌లను బార్‌లుగా మార్చడం ప్రజల ఆకాంక్షలను అవమానపరచడమేనని, గోవా మోడల్ పేరుతో మద్యం సంస్కృతిని రుద్దాలని చూస్తే ప్రజలు ఎన్నటికీ అంగీకరించరన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకుని ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థుల విషయంలో స్పష్టమైన ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని, ఒక ఘటన జరిగితే దానిని రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం, మరో ఘటనలో బాధిత కుటుంబాలనే వేధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. చట్టం అందరికీ ఒకే విధంగా ఉండాలి గానీ అధికారంలో ఉన్నవారికి ఒక న్యాయం, ప్రతిపక్షానికి మరో న్యాయం అనే ధోరణిని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. హోంమంత్రి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తిగా రాజకీయ ఆరోపణలకు కాకుండా వాస్తవాలు, ఆధారాల ఆధారంగా మాత్రమే మాట్లాడాలని హితవు పలికారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారు చేసే ప్రతి వ్యాఖ్య ప్రజల్లో విశ్వాసాన్ని పెంచేదిగా ఉండాలి కానీ వివాదాలను రెచ్చగొట్టేదిగా ఉండకూడదని సూచించారు. ప్రజాస్వామ్యంలో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని అందువల్ల వ్యక్తిగత దూషణలు, అహంకారపూరిత వ్యాఖ్యలు మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. అధికారాలు శాశ్వతం కావు, ప్రజల తీర్పే శాశ్వతమని, రాబోయే ఎన్నికల్లో ప్రజలే తుది తీర్పు ఇస్తారని, ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని సూచించారు. విశాఖ బీచ్‌లలో మద్యం విక్రయాలను వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు, మహిళా సంఘాలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఉద్యమాలను ప్రభుత్వం తేలిగ్గా తీసుకుంటే పరిణామాలు వేరేగా ఉంటాయని హెచ్చరించారు.



## ఎమ్మెల్యే కొణతాలను కలిసిన జిల్లా ఆరోగ్య శాఖ అధికారి

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లా బదిలీపై అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం ఆరోగ్యశాఖ అధికారిగా డి ఎం హెచ్ ఓ బాధ్యతలు స్వీకరిస్తూ డాక్టర్ అచ్యుత కుమారి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ను పార్టీ ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కు సంబంధించిన పలు విషయాలు అంశాలపై కూ ల సంఘ వీరిద్దరూ చర్చించడం జరిగింది. ప్రజలకు మెరుగైన రైతు సేవలు నంద్యాల చూడాలని వైద్యాలలో ఎటువంటి లోటుబాట్లు లేకుండా చూసుకోవాలని వైద్యశాఖ అభివృద్ధి కార్యక్రమాలు బాగా జరిగేలా చూడాలని ఎన్టీఆర్ వైద్యాలయం పేరు ప్రతిష్టలు మరింత ఈముడింపేలా చేయాలని వారు కోరడం జరిగింది.

## మహిళపై అమానుష దాడిపై సీరియస్

**వివస్త్రను చేసిన నిందితుడుపై క్రిమినల్ కేసు**

**సీఎం చంద్రబాబు కన్నెర్ర**

**(గుంటూరు - జయజయహే)**

గుంటూరులోని కృష్ణబాబు కాలనీలో తాగునీటి విషయంలో జరిగిన గొడవలో ఓ మహిళను అతి నీచంగా కొట్టారు. ఆమెను వివస్త్రను చేసి దాడి చేశారు. ఈ దాడిలో మల్లెల మూర్తి అనే టీడీపీ నేత హస్తం ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఓ మహిళ ఇంటి మోటార్ తొలగించడంపై వివాదం మొదలైంది. చాలా కాలంగా ఇదే ప్రాంతంలో నివాసం ఉంటున్న మహిళ ఇంటి పైప్‌లైన్‌కు ఒక మోటార్ ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఈ మధ్య ఆ ప్రాంతంలో సిమెంట్ రోడ్డువేశారు. దీంతో ఆ మోటార్‌ను తొలగించాలని స్థానిక నేత మల్లెల వెంకటరమణ మూర్తి మహిళకు చెప్పారు. వినకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారులు జోక్యం చేసుకున్నప్పటికీ మోటార్‌తో సిమెంట్ రోడ్డుకు ఎలాంటి ఇబ్బంది లేదని వాదించారు. ఈ క్రమంలోనే వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూర్తి అనే వ్యక్తి బెదిరిస్తున్నాడని అందులో పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వచ్చిన తర్వాత ఆ మహిళపై దాడి జరిగింది. మూర్తి, ఆయన చెల్లి వరుస అయ్యే ట్రాన్స్ జెండర్ మాధవితోపాటు అంతా కలిసి మహిళపై దాడి చేశారు. ఆమెను కిందపడేసి తొక్కారు.ఆమె వేసుకున్న బట్టలను చించేశారు. బూతులు తిడుతూ కొట్టారు. స్థానికులు వచ్చి నిలదీయడంతో అక్కడి నుంచి వారంతా జారుకున్నారు. చుట్టుపక్కల వారంతా ఆమెను నగరంపాలెం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు మూర్తితోపాటు దాడి చేసిన 8 మందిపై కేసులు నమోదు చేశారు.

**సీఎం చంద్రబాబు సీరియస్**

దీని గురించి తెలుసుకున్న ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై ఎక్స్‌వేదికగా స్పందించారు. ఘటన తనను కలచివేసిందని అన్నారు. ఏ మహిళనైనా అవమానించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, ఇలాంటి ఘటనలకు సమాజంలో తావు లేదని స్పష్టం చేశారు. ఘటనపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు సీఎం ఎక్స్ వేదికగా తెలిపారు. నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేశారని, ఘటనకు సంబంధం ఉన్న వ్యక్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. చట్టం ముందు అందరూ సమానమేనని, రాజకీయ పార్టీల పేరు చెప్పుకుని తప్పులు చేయాలనుకునే వారికి ఎలాంటి రక్షణ ఉండదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి మహిళకు గౌరవం, భద్రత కల్పించే విషయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇప్పటికే దీనిపై హోంశాఖ మంత్రి అనిత స్పందించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని అన్నారు. గుంటూరులో మహిళపై దాడి చేసిన వారని చట్టం ముందు దోషులుగా నిలబెట్టాలని ఆదేశించారు.. ఎస్పీతో మాట్లాడిన ఆమె కేసు పూర్తి వివరాలు తెలుసుకున్నారు.



## గణేష్ నగర్‌లో డెంగీ

**అప్రమత్తమైన మలేరియా అధికారులు**

**విశాఖపట్నం, జూలై 18, జయ జయహే :**

నగరంలో డెంగీ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వర ప్రసాద్ రెడ్డి, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ బి. నాగభూషణ రావు పిలుపునిచ్చారు. శనివారం ఓల్డ్ ఐటీఐ జంక్షన్ గణేష్ నగర్లో మలేరియా కేసులపై సర్వే నిర్వహించారు. దాదాపు 50 ఇళ్లను తనిఖీ చేసి నీటి నిల్వలపై ఆరా తీసి లారాలను రెండు చోట్ల గుర్తించారు. నీటి నిల్వ ఉంటే దోమలు పెరుగుతాయని ఎప్పటి కప్పుడు నీటిని మార్చుకోవాలని సూచించారు. లేకుంటే దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ కేసులకు దారి తీస్తామని హెచ్చరించారు. గణేస్ నగర్లో ఇటీవల 17 ఏళ్ల అబ్బాయికి డెంగీ వచ్చింది. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆదేశాల మేరకు అప్రమత్తమైన మలేరియా విభాగం గణేష్ నగర్లో తనిఖీలు చేపట్టారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నీటి నిల్వవల్ల కలిగే అనర్థాలను వివరించి చైతన్యం తెచ్చే యత్నం చేశారు. పనిలో పనిగా ఫీవర్ సర్వే కూడా చేపట్టినట్టు అధికారులు తెలిపారు. ఇండోర్ స్పేస్ స్ప్రే కూడా చేపట్టడంతో బాటు అవగాహన కోసం కర పత్రాలను పంపిణీ చేశారు. మలేరియా సూపర్‌వైజర్ కళ్యాణ్, జీవీఎంసీ మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

# పరోపకారం

(సి.హెచ్.ప్రతాప్)

**పరోపకారాయ ఫలంతి వృక్షాః।**
**పరోపకారాయ వహంతి నద్యః।**
**పరోపకారాయ దుహంతి గావః।**
**పరోపకారార్థమిదం శరీరం॥**

మన భారతీయ సంస్కృతి మానవ జీవితాన్ని కేవలం వ్యక్తిగత ప్రయోజనాలకే పరిమితం చేయకుండా, సమాజ హితంతో ముడిపెట్టింది. ఆ ఆలోచనకు ప్రతీకగా నిలిచే ఈ సంస్కృత శ్లోకం ప్రకృతి చూపే నిస్వార్థ సేవను ఉదాహరణగా తీసుకొని, మనిషి జీవన లక్ష్యాన్ని అత్యంత సరళంగా వివరిస్తుంది. ఈ శ్లోకంలో ప్రతి పాదం ఒక గొప్ప జీవన సత్యాన్ని ఆవిష్కరిస్తుంది. చెట్లు తమ ఫలాలను తాము తినవు. నదులు తమ నీటిని తాము ఉపయోగించుకోవు. ఆవులు తమ పాలను తాము తాగవు. ప్రకృతిలోని ప్రతి అంశం పరులకు ఉపయోగపడటానికే తన ఉనికిని సార్థకం చేసుకుంటుంది. అదే విధంగా మనిషి శరీరం కూడా పరోపకారానికి అంకితం కావాలని ఈ శ్లోకం బోధిస్తుంది.

వృక్షం మనకు ఎంతో గొప్ప గురువు. అది వేసవిలో నీడనిస్తుంది, ఆకలితో ఉన్నవారికి ఫలాలను అందిస్తుంది, ప్రాణవాయువును ప్రసాదిస్తుంది. రాళ్లు విసిరినా, కొమ్మలు నరికినా తన స్వభావాన్ని మార్చుకోదు. ప్రతిఫలం ఆశించకుండా ఇచ్చే గుణమే వృక్ష మహత్తు. ఇదే గుణం మనిషి జీవితంలో అలవడితే కుటుంబం నుంచి సమాజం వరకు సౌహార్ద వాతావరణం ఏర్పడుతుంది.

నదుల ప్రవాహం కూడా నిస్వార్థ సేవకు ప్రతీక. అవి పర్వతాల నుంచి సముద్రం వరకు నిరంతరం ప్రవహిస్తూ కోట్లాది జీవులకు జీవనాధారంగా నిలుస్తాయి. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక అభివృద్ధి వంటి అనేక రంగాలకు నదులే ప్రాణాధారం. ఎక్కడా ప్రతిఫలం కోరని ఈ సహజ స్వభావం మానవుడికి సేవా దృక్పథాన్ని నేర్పుతుంది. జీవితం కూడా నిలిచిపోయే చెరువులా కాకుండా, ప్రవహించే నదిలా ఇతరులకు ఉపయోగపడుతూ ముందుకు సాగాలని ఈ సందేశం సూచిస్తుంది.

ఆవు భారతీయ సంప్రదాయంలో కరుణ, దాతృత్వానికి చిహ్నంగా భావించబడుతుంది. తన పాలను దూడతో పాటు మానవాళికీ అందిస్తూ ఎన్నో కుటుంబాలకు పోషకాహారాన్ని అందిస్తుంది. తన జీవితాంతం వ్యవసాయానికి, పాడి పరిశ్రమకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుంది. ఇవ్వడంలోనే ఆనందం ఉందనే విలువను అది నిశ్శబ్దంగా బోధిస్తుంది.

ఈ శ్లోకంలోని చివరి పాదమే ప్రధాన సందేశం. మన శరీరం కేవలం భోగాల కోసం కాదు; సమాజానికి ఉపయోగపడే కార్యాల కోసం కూడా వినియోగించబడాలి. పరోపకారం అంటే ధనం దానం చేయడం మాత్రమే కాదు. అవసరంలో ఉన్నవారికి ఓదార్పు చెప్పడం, విద్యను పంచడం, రక్తదానం చేయడం, పర్యావరణాన్ని సంరక్షించడం, వృద్ధులకు సహాయం చేయడం, ప్రజా ఆస్తులను కాపాడడం, నిజాయితీతో విధులను నిర్వర్తించడం కూడా పరోపకారమే. ప్రతి వ్యక్తి తన సామర్థ్యానికి తగ్గట్టు చేసే చిన్న సేవ కూడా సమాజ నిర్మాణంలో గొప్ప పాత్ర పోషిస్తుంది.

నేటి వేగవంతమైన ప్రపంచంలో వ్యక్తిగత విజయాలకే అధిక ప్రాధాన్యం పెరుగుతున్న వేళ ఈ శ్లోకం మరింత ప్రాసంగికంగా మారింది. సంపద, హోదా, అధికారాల కంటే సేవాభావమే మనిషికి నిజమైన గౌరవాన్ని తెచ్చిపెడుతుంది. స్వార్థంతో కూడిన జీవితం తాత్కాలిక సంతృప్తిని మాత్రమే ఇస్తుంది. కానీ ఇతరుల జీవితాల్లో వెలుగు నింపే సేవ శాశ్వతమైన ఆనందాన్ని అందిస్తుంది. ప్రకృతి మనకు చూపిస్తున్న ఈ నిస్వార్థ జీవన విధానాన్ని ఆచరణలోకి తీసుకొచ్చినప్పుడే వ్యక్తి వికాసంతో పాటు సమాజ శ్రేయస్సు కూడా సాధ్యమవుతుంది. పరోపకారమే మానవత్వానికి పరమాభరణం, జీవనానికి పరమార్థం అని ఈ శాశ్వత సందేశం ప్రతి తరానికీ మార్గదర్శకంగా నిలుస్తుంది.

# వాలీ: శక్తి, అధికారం, ధర్మం-నాయకత్వానికి శాశ్వత పాఠం

**రామాయణంలోని వాలీ పాత్ర కేవలం ఒక పరాక్రమశాలి వానరరాజు కథ మాత్రమే కాదు. అది శక్తి, అధికారం, నాయకత్వం, ధర్మం మధ్య ఉన్న సూక్ష్మమైన సంబంధాన్ని ప్రతిబింబించే శాశ్వత నైతిక గాథ. అపారమైన బలం, అసాధారణ వీరత్వం, న్యాయబోధ కలిగిన వాలీ, చివరికి అహంకారం కారణంగా తన పతనాన్ని తానే ఆహ్వానించుకున్నాడు. "శక్తి ఒక వరం కాదు; అది బాధ్యత." ఈ సందేశమే వాలీ జీవితానికి కేంద్రబిందువు.**




### అపార పరాక్రమం... కానీ అహంకారపు నీడ

వాలీ వానరరాజ్యంలో అజేయుడిగా పేరుగాంచాడు. శత్రువులను ఎదుర్కొనే ధైర్యం, అసమానమైన బలం, రాజ్యాన్ని రక్షించే సామర్థ్యం---ఇవన్నీ ఆయనను గొప్ప నాయకుడిగా నిలబెట్టాయి.

అయితే, అదే శక్తిపై అతిగా నమ్మకం, తన నిర్ణయాలే అంతిమమనే భావన, సోదరుడు సుగ్రీవుని మాట వినడానికి నిరాకరించడం ఆయన వ్యక్తిత్వంలోని బలహీనతను బయటపెట్టాయి. వినయం స్థానంలో గర్వం పెరిగినప్పుడు, నాయకత్వం ధర్మాన్ని కోల్పోతుందని వాలీ కథ తెలియజేస్తుంది. "అహంకారం ఎదిగిన చోట ధర్మం మసకబారుతుంది."

సుగ్రీవునితో విభేదం: అధికార దుర్వినియోగానికి ఉదాహరణ

సుగ్రీవునితో జరిగిన వివాదం వాలీ జీవితంలో కీలక మలుపు. వివాదాన్ని న్యాయబద్ధంగా పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ, ఆయన తన బలాన్నే నమ్ముకున్నాడు. సోదర సంబంధాల కంటే అధికారం ముఖ్యమైపోయింది.

ఈ సంఘటన కుటుంబ బంధాలను మాత్రమే కాదు, రాజధర్మాన్ని కూడా దెబ్బతీసింది. అధికారాన్ని వ్యక్తిగత కోపానికి ఉపయోగించినప్పుడు దాని ప్రభావం వ్యక్తులకే పరిమితం కాకుండా సమాజంపైనా పడుతుందని ఈ సంఘటన సూచిస్తుంది. "అధికార దుర్వినియోగం వ్యక్తిని మాత్రమే కాదు, సమాజాన్నీ బలహీనపరుస్తుంది."

### శ్రీరాముడి బాణం... ఒక తాత్విక ప్రశ్న

శ్రీరాముడు వాలీని చెట్టు చాటునుండి బాణంతో సంహరించిన సందర్భం రామాయణంలోని అత్యంత చర్చనీయాంశమైన ఘట్టాలలో ఒకటి. ఆ సమయంలో వాలీ అడిగిన ప్రశ్న---"ఇది ధర్మమా?"

ఈ ప్రశ్నకు శ్రీరాముడు ఇచ్చిన సమాధానం కేవలం వాలీకే కాదు, ప్రతి అధికారస్థుడికీ వర్తించే ధర్మసూత్రంగా నిలుస్తుంది. వ్యక్తిగత బలం, అధికారాన్ని న్యాయం కోసం కాకుండా



దుర్వినియోగం చేసినప్పుడు, ధర్మం అతనికి అనుకూలంగా నిలవద ని శ్రీరాముడు స్పష్టం చేశాడు.

ఈ సంభాషణ శక్తి వినియోగానికి నైతిక పరిమితులను గుర్తుచేస్తుంది.

### ఆధునిక నాయకత్వానికి వాలీ కథ చెప్పే పాఠాలు

వాలీ కథ నేటి రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, వ్యాపారవేత్తలు, సంస్థాధిపతులు, సామాజిక నాయకులు అందరికీ సమానంగా వర్తిస్తుంది.

అధికారం ప్రజాసేవకు ఉపయోగిస్తే అది ధర్మపరమైన నాయకత్వం. వ్యక్తిగత లాభం, ప్రతీకారం లేదా అహంకారం కోసం వినియోగిస్తే అదే అధికారం పతనానికి కారణమవుతుంది.

నాయకత్వం అనేది కేవలం అధికారాన్ని కలిగి ఉండటం కాదు; ఆ అధికారాన్ని బాధ్యతతో వినియోగించగల నైతికత కలిగి ఉండటమే నిజమైన నాయకత్వం. "నాయకుడి గొప్పతనం అతని శక్తిలో కాదు; ఆ శక్తిని ఎలా వినియోగిస్తాడనే విషయంలో ఉంటుంది."

### వినయమే నాయకత్వానికి అసలైన బలం

వాలీ జీవితగాథ మరో శాశ్వత సత్యాన్ని గుర్తుచేస్తుంది. శక్తి, జ్ఞానం, విజయాలు ఉన్నా వినయం లేకపోతే అవన్నీ నిలవవు. నాయకత్వానికి అహంకారం కాదు, సేవాభావం అవసరం.

వినగల నాయకుడు నిలుస్తాడు; గర్వంతో నడిచే నాయకుడు ఒంటరిగా మిగిలిపోతాడు." విజయం శక్తిని ఇస్తుంది; వినయం ఆ శక్తికి విలువను ఇస్తుంది."

### సమాజానికి శాశ్వత సందేశం


వాలీ కథ ఒక పురాణ పాత్ర చరిత్ర మాత్రమే కాదు. అది ప్రతి యుగానికీ వర్తించే నాయకత్వ పాఠం. శక్తి, అధికారం, బాధ్యత, ధర్మం మధ్య సమతుల్యత కోల్పోతే, ఎంత బలవంతుడైనా పతనం తప్పదని ఈ కథ స్పష్టం చేస్తుంది.

నేటి సమాజంలోనూ ఈ సందేశం సమానంగా ప్రాసంగికమే. ప్రజల విశ్వాసంతో వచ్చిన అధికారాన్ని ప్రజల సంక్షేమం కోసం వినియోగించినప్పుడే నాయకత్వం గౌరవాన్ని పొందుతుంది.

### ముగింపు

వాలీ రామాయణంలో అత్యంత శక్తిమంతుడైన రాజు. కానీ ఆయన జీవితగాథ మనకు చెప్పేది ఒకే సత్యం--- "శక్తి నిన్ను గొప్పవాడిని చేయదు; దాన్ని ధర్మంతో ఉపయోగించడం నీ గొప్పతనం."

అందుకే వాలీ కథ నాయకత్వానికి నైతిక సరిహద్దులు అవసరమని గుర్తు చేస్తుంది. మనిషి ఎంత శక్తిమంతుడైనా, ధర్మాన్ని విస్మరిస్తే ఆ శక్తే అతని పతనానికి కారణమవుతుంది. "అహంకారంతో సాధించిన విజయం తాత్కాలికం; ధర్మంతో సంపాదించిన గౌరవం శాశ్వతం."



ప్రొఫెసర్
విశ్వేశ్వర రావు
చెనమల్లు

# ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి ఇవ్వనున్న
# బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

(సి.హెచ్.ప్రతాప్)

భారత్ మరియు యునైటెడ్ కింగ్‌డమ్ (బ్రిటన్) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్) భారత విదేశీ వాణిజ్య చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. ఇరు దేశాల మధ్య అనేక సంవత్సరాల చర్చల అనంతరం ఈ ఒప్పందం రూపుదిద్దుకుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా మారుతున్న పరిస్థితుల మధ్య, ఎగుమతులను పెంచడం, పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలను విస్తరించడం వంటి లక్ష్యాలకు ఈ ఒప్పందం బలమైన పునాది వేస్తుందని భావిస్తున్నారు.

ఈ ఒప్పందం ప్రకారం, భారత్ మరియు బ్రిటన్ పరస్పరం అనేక ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించుకోవడం లేదా పూర్తిగా తొలగించుకోవడానికి అంగీకరించాయి. భారతీయ వస్తువులలో అత్యధిక భాగానికి బ్రిటన్ మార్కెట్‌లో సుంక రహిత లేదా తక్కువ సుంకంతో ప్రవేశం లభించనుంది. అదే విధంగా, బ్రిటన్‌కు చెందిన కొన్ని వస్తువులు భారత మార్కెట్‌లో తక్కువ సుంకాలతో అందుబాటులోకి రానున్నాయి. అయితే వ్యవసాయం, పాల ఉత్పత్తులు వంటి సున్నిత రంగాలకు భారత్ తగిన రక్షణ కల్పించింది.

ఈ ఒప్పందం వల్ల భారత వస్త్ర, దుస్తులు, తోలు ఉత్పత్తులు, రత్నాలు--ఆభరణాలు, సముద్ర ఆహార ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులు, ఔషధాలు, ఆటో విడిభాగాలు, రసాయన ఉత్పత్తుల ఎగుమతులకు విశేష ప్రోత్సాహం లభించే అవకాశం ఉంది. బ్రిటన్ మార్కెట్‌లో దిగుమతి సుంకాలు తగ్గడంతో భారత ఉత్పత్తులు ధర పరంగా మరింత పోటీతత్వాన్ని సాధిస్తాయి. దీంతో భారత తయారీ రంగానికి కొత్త ఆర్డర్లు లభించి, పరిశ్రమల విస్తరణకు అవకాశం ఏర్పడుతుంది.

సేవారంగానికి కూడా ఈ ఒప్పందం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సమాచార సాంకేతిక సేవలు, ఆర్థిక సేవలు, న్యాయ సలహా, విద్య, పరిశోధన వంటి రంగాలలో భారత నిపుణులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. భారతీయ వృత్తి నిపుణులు, సాంకేతిక నిపుణులు, కన్సల్టెంట్లు బ్రిటన్‌లో



తాత్కాలికంగా పనిచేసేందుకు అనుకూల నిబంధనలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో భారత యువతకు అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు విస్తరించవచ్చు.

ఈ ఒప్పందంలోని మరో ముఖ్యమైన అంశం రెండు దేశాల మధ్య పెట్టుబడుల ప్రోత్సాహం. బ్రిటన్‌కు చెందిన సంస్థలు భారతదేశంలో తయారీ, మౌలిక వసతులు, ఆర్థిక సేవలు, పునరుత్పాదక ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు మరింత ఆసక్తి చూపే అవకాశం ఉంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరగడం ద్వారా సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక నిర్వహణ పద్ధతులు, నైపుణ్యాభివృద్ధి దేశంలోకి ప్రవేశిస్తాయి.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కూడా ఈ ఒప్పందం కొత్త అవకాశాలను అందిస్తుంది. బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన మార్కెట్‌లో తమ ఉత్పత్తులను విక్రయించడానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. నాణ్యతా ప్రమాణాలను పాటించే సంస్థలకు అంతర్జాతీయ మార్కెట్‌లో స్థిరమైన గుర్తింపు లభించే అవకాశం ఉంది.

వినియోగదారుల దృష్టిలో కూడా ఈ ఒప్పందం ప్రయోజనకరమే. బ్రిటన్ నుంచి దిగుమతి అయ్యే కొన్ని నాణ్యమైన ఉత్పత్తులు తక్కువ ధరలకు అందుబాటులోకి రావచ్చు. అదే సమయంలో భారతీయ కంపెనీలు ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా తమ ఉత్పత్తుల నాణ్యతను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఏర్పడుతుంది. దీని వల్ల దేశీయ పరిశ్రమలు పోటీతత్వాన్ని పెంచుకుని ప్రపంచ సరఫరా గొలుసులో మరింత బలంగా నిలిచే అవకాశం ఉంటుంది.

అయితే ఈ ఒప్పందం విజయవంతం కావాలంటే భారత పరిశ్రమలు నాణ్యత, ఉత్పాదకత, వ్యయ నియంత్రణ, పర్యావరణ ప్రమాణాలు, కార్మిక నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రభుత్వం కూడా ఎగుమతి మౌలిక వసతులు, లాజిస్టిక్స్, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. చిన్న పరిశ్రమలకు సాంకేతిక సహాయం, మార్కెట్ సమాచారం, ఆర్థిక సౌకర్యాలు అందుబాటులో ఉంటే ఈ ఒప్పందం ప్రయోజనాలు దేశవ్యాప్తంగా విస్తరించగలవు.

మొత్తంగా చూస్తే, భారత్--బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కేవలం వాణిజ్యాన్ని పెంచే ఒప్పందం మాత్రమే కాదు. ఇది భారత తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, ఎగుమతులను విస్తరించడం, పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధిని పెంచడం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత స్థాయిని మరింత బలపరచడం వంటి అనేక దీర్ఘకాలిక లక్ష్యాలకు దోహదపడే వ్యూహాత్మక అడుగు. సరైన అమలు, పరిశ్రమల సన్నద్ధత, ప్రభుత్వ సహకారం కలిసివస్తే ఈ ఒప్పందం "వికసిత భారత్" లక్ష్య సాధనలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

## నేటి నుండి అమరావతి
# ఛాంపియన్‌షిప్ పోటీలు

మాడుగుల జూలై 18 జయ జయహే



ఈ నెల 19 వ తేదీ నుండి 23 వ తేదీ వరకు మాడుగుల నియోజకవర్గ స్థాయిలో అమరావతి ఛాంపియన్స్ కప్ - 2026 లో భాగంగా మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్ -17, అండర్ -23 వయస్సుల వారికి మెన్ అండ్ విమెన్ కేటగిరిలో క్రీడ పోటీలు నిర్వహించనున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముత్యాల నాయుడు శనివారం తెలిపారు. మొత్తం 12 క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు విధిగా ప్లేయర్ రిజిస్ట్రేషన్ ముందుగా చేయించుకొని పాల్గొనాలి అని తెలిపారు.

### క్రీడా పోటీల షెడ్యూల్

19 వ తేదీన ఆర్చరీ సెలెక్షన్ ట్రయల్స్ సంస్కృతి గ్లోబల్ స్కూల్,పరవాడ లోను,

19 వ తేదీన ఎలమంచిలి డిగ్రీ కళాశాల మైదానంలో హాకీ సెలెక్షన్ ట్రయల్స్

20 వ తేదీన నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తారన్నారు.

21 వ తేదీన మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ,వాలీ బాల్ పోటీలు,

21 వ తేదీన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు అనకాపల్లి ఎస్ ఆర్ డి జిమ్ లోను,21 న సబ్బవరం పాఠశాలలో బాస్కెట్ బాల్ పోటీలు ప్రతిభ సెలక్షన్స్, అదే రోజు చోడవరం కృష్ణ బ్యాట్మెంటన్ అకాడమీలో

21 వ తేదీన బాడ్మింటన్ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తారన్నారు.

22 న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అథ్లెటిక్స్ సెలెక్షన్ ట్రయల్స్ ,23 న ఖో ఖో,యోగా పోటీలు మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ,

26 వ తేదీన చెస్ పోటీలు నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియం నిర్వహిస్తారని తెలియజేశారు.

మరిన్ని వివరాలకు మాడుగుల నియోజకవర్గ కో - ఆర్డినేటర్ బి కిరణ్ కుమార్ని,954232156 మాడుగుల పాఠశాల వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు ఉమామహేశ్వర రావు ని 8978055443 సంప్రదించాలని పేర్కొన్నారు.

# భారత్ అంతరిక్ష చరిత్రలో నూతన అధ్యాయం

## శ్రీహరికోట నుంచి స్కైరూట్ విక్రమ్-1ప్రయోగం విజయవంతం

**శ్రీహరికోట,జూలై 18, జయ జయహే**



భారత అంతరిక్ష రంగంలో మరో చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. భారతీయ ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన చిన్న ఉపగ్రహ ప్రయోగ వాహనం విక్రమ్-1 శనివారం మధ్యాహ్నం 12:05:30 గంటలకు శ్రీహరికోటలోని ఇస్రో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. భారత భూభాగం నుంచి ఒక ప్రైవేట్ భారతీయ సంస్థ తొలిసారిగా కక్ష్యలోకి రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించడం దేశ అంతరిక్ష చరిత్రలో కొత్త మైలురాయిగా నిలిచింది. 2020లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంతరిక్ష రంగ సంస్కరణలు, అనంతరం అమలులోకి వచ్చిన ఇండియన్ స్పేస్ పాలసీ ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని నిపుణులు పేర్కొంటున్నారు. నాలుగు దశలతో రూపొందించిన విక్రమ్-1 రాకెట్‌లో మూడు ఘన ఇంధన దశలు, ఒక ద్రవ ఇంధన దశ ఉన్నాయి. ఈ రాకెట్ ద్వారా స్కోప్,గ్రహ ఉపగ్రహాలను భూమికి సమీప కక్ష్య లియోలో విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఇతర పేలోడ్‌లతో శాస్త్రీయ ప్రయోగాలు కొనసాగుతున్నాయి. ఇంతకుముందు 2022లో విక్రమ్-ఎస్ ఉపకక్ష్య ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసిన స్కైరూట్, ఇప్పుడు తొలి కక్ష్య ప్రయోగంలోనూ విజయం సాధించి భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటింది. ఈ ప్రయోగానికి ఇస్రో, ఇన్-స్పేస్, సంస్థలు సాంకేతిక సహకారం అందించగా, భారత అంతరిక్ష రంగంలో ప్రభుత్వ--ప్రైవేట్ భాగస్వామ్యానికి ఇది ఒక నూతన అధ్యాయంగా నిలిచింది.

## 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జల

**శ్రీకాళహస్తి, జులై 18,జయ జయహే**



శ్రీకాళహస్తి మార్కెట్ యార్డ్ లో శనివారం 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కూటమి ముఖ్య నాయకులు, అధికారులు, కార్యకర్తలతో కలిసి కార్యక్రమం లో పాల్గొన్నారు.శ్రీకాళహస్తి కేవలం ఒక పట్టణమే కాదు, దేశంలోనే ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం. అందుకే నియోజకవర్గంలో పారిశుధ్యం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సేవలను ప్రత్యేకంగా అభినందించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో పారిశుద్ధ్య సేవా కార్యక్రమం

**అనకాపల్లి జయ జయహే**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య సేవా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగ మూడవ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం ప్రాంగణంలో పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు అదనపు ఎస్పి ఎల్ మోహన్ రావు ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని శ్రమదానం చేసి ప్లాస్టిక్ పై సమరం పర్యావరణ పరిరక్షణ దేయంగా ప్లాస్టిక్ మహమ్మారి నుండి ఈ సమాజం రక్షించండి ఇలాంటి కార్యక్రమాలు దోహదం పడతాయని సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పోలీసు కార్యాలయ పరిసరాల్లో పర్యావరణానికి తీవ్ర హాని కలిగించే సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను వాడకని పూర్తిగా అరికట్టడం దానికి ప్రత్నమయ్య పర్యావరణ హితమైన వస్తువులు వాడకాన్ని ప్రోత్సహించాలని, పరిసరాలు మన పని చేసే కార్యాలయాలు రికార్డు రూములు ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పరిసరాలు దుమ్ము ధూళి లేకుండా మరియు మనం పని చేసే ప్రాంగణాలు బయట పచ్చని చెట్లు మొక్కలు ఉండేలా తీర్చిదిద్దుకోవాలని వారి పేర్కొన్నారు. దీనికి ప్రజా చైతన్యమే అంతిమ లక్ష్యంగా 20047 నాటికి ఆంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ రహిత స్వచ్ఛమైన వాతావరణం ఆరోగ్యకరమైన సమాజం మరియు సృష్టిలో సంపద కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దరమే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర యొక్క అంతిమ లక్ష్మణ్ ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ బాల సూర్యారావు లక్ష్మి శ్రీనివాసరావు సురేష్ రమణయ్య ఎస్సైలు ప్రసాద్ సురేష్ బాబు అంజిబాబు ప్రకాష్ రావు మరి జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దడం జరిగింది



## గొర్రెలు మేకల పెంపకం దారుల సదస్సు

**అనకాపల్లి జయ జయహే**

గొర్రెలు మేకల పెంపకం దారుల సహకార సంఘాలతో కోఆపరేటివ్ రంగంపై అవగాహన సదస్సు అనకాపల్లి వివేకానంద హాలులో సమావేశం నిర్వహించడం జరిగింది ఉమ్మడి విశాఖ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనిట్ చైర్మన్ గంట శ్రీరామ్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కోన తాతారావు పాల్గొనడం జరిగింది . ఆయన మాట్లాడుతూ గొర్రెలు మేకలు పెంపకం దారుల సహకార సంఘాలకు డి సి సి బి నుంచి సహకారం అందిస్తానని భూములు ఉన్నవారికి వాటి హామీతో ఎకరానికి ఆరు లక్షల వరకు రుణాలు అందిస్తామని వీటిని ఉపయోగించుకోవాలని సభ్యులకు ఆయన సూచించారు ప్రభుత్వం మరియు డిసిసిబి కార్పొరేషన్ నుంచి సబ్సిడీ తెచ్చుకుంటే తమ బ్యాంకు నుండి రుణం ఇవ్వడం ఇవ్వడం జరుగుతుందని పెంపకం దారుల సహకార సంఘాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ను ఉపయోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ పథకాలకు తమ బ్యాంకు నుండి పూర్తి సహాయ సహకార అందజేస్తామని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ షబ్బీ శ్రీనివాసరావు, డైరెక్టర్ బి వరహాలు, విదిరి అప్పారావు, గోకాడ దేవుడు నాయుడు, ఊరికిటి శివ సూర్యనారాయణ, పి సత్యారావు, పల్ల శ్రీరాములు,ఎం రామరాజు, చొప్ప వెంకట అప్పారావు, ఎలమంచిలి అప్పారావు తదితరులు పాల్గొన్నారు



## మలేరియా, డెంగ్యూపై అవగాహన కార్యక్రమం

**కుప్పం,జూలై 18, జయ జయహే.**

కుప్పం మండలంలోని ఎన్‌కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుభాష్ రాజా ఆధ్వర్యంలో మలేరియా, డెంగ్యూపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని నూలుకుంట గ్రామంలోని హైస్కూల్‌లో మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధులు వ్యాపించే విధానం, వాటి లక్షణాలు, నివారణ చర్యలు, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది వి. ముత్తుకుమార్, గౌతమి, గీత, ఆశా కార్యకర్తలు లక్ష్మి, పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ు




## కాణిపాకంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

**పూతలపట్టు, జూలై 18, జయ జయహే.**

శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ సూచనల తో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం అతిథి గృహంలో దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , దేవస్థానం సిబ్బందితో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు నాగరాజు నాయుడు, శివ ప్రసాద్, ఏఈఓలు ఎస్వి కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, ధనంజయ, సూపర్డెంట్ కోదండపాణి, ఇంజనీరింగ్ ఏ.ఈలు, శానిటరీ సిబ్బంది, దేవస్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష ఫలితాలులో సత్తా చాటిన ఎంజీఎం కాలేజ్ విద్యార్థిని

**శ్రీకాళహస్తి, జులై 18,జయ జయహే**



నీట్ పరీక్ష ఫలితాల్లో ఎం జి ఎం కళాశాల విద్యార్థిని కే.జ్యోతి కుమార్ హాసిని ప్రియా- 403/720 మార్కులు సాధించి డాక్టర్ కోర్స్ కి అర్హత సాధించింది. ఈ సందర్భంగా ఎంజిఎం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్ మంచి ర్యాంక్ సాధించిన విద్యార్థినిని అభినందించారు.ముందు ముందు మరెన్నో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కి బాగా చదివి ఒక గొప్ప డాక్టర్ గా అవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంజిఎం కాలేజ్ ప్రిన్సిపల్ వి.ఎస్ రత్నం, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులకు ప్రొఫెషనల్ డెవలప్మెంట్ శిక్షణ

**చోడవరం, జూలై 18 జయ జయహే**

ఉపాధ్యాయులకు ప్రొఫెషనల్ డెవలప్మెంట్ శనివారం ఒకరోజు చేసిన కార్యక్రమాన్ని నిర్వహించారు.చోడవరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరు మండలాల గణితం,భౌతిక శాస్త్రః,జీవ శాస్త్రం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు 350మంది ఉపాధ్యాయులకు ఈ శిక్షణ అందజేశారు.చోడవరం, బుచ్చయ్యపేట,మాడుగుల,చీడికాడ, కోటపాడు, దేవరాపల్లి మండల స్కూల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.మారిన పాఠ్యపుస్తకాలపై అవగాహన, నూతన బోధనా పద్ధతులు, ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొనుటకు శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఈ కార్యక్రమంలో పాల్గొన్న చోడవరం మండ విద్యాశాఖాధికారులు నీలకంఠం, సింహాచలం పేర్కొన్నారు.ఈ ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నకు కోర్సు డైరెక్టర్ లుగా రామిరెడ్డి, వి.వి.శేషగిరిరావు వ్యవహరించారు.సి.ఆర్.యమ్.టిలు నాయుడు,చంద్రికా,భూలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన వన్నెంరెడ్డి సతీష్ కుమార్

**విశాఖపట్నం: (జయ జయహే)**



జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలోని గ్రంథాలయాలకు మౌలిక సదుపాయాలు కల్పించి, వాటికి పునర్వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ తెలిపారు. ఇటీవల మంత్రి నారా లోకేష్ ను కలిసి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, నిధుల కొరత మరియు భవన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళడం జరిగింది. మంత్రి సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని సూచించడంతో పాటు, భవన సదుపాయం కోసం జిల్లా కలెక్టర్‌ను సంప్రదించాల్సిందిగా సూచించారు. ఈ నేపథ్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఎం.అభిషిక్త్ కిషోర్ ను కలవడం జరిగింది. ఈ సందర్భంగా, జిల్లా కేంద్ర గ్రంథాలయం మరియు గ్రంథాలయ కార్యాలయాలకు శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యే వరకు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న 'డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్' భవనంలో తాత్కాలిక వసతి కల్పించవలసిందిగా ఆయన కోరారు. అలాగే, చిల్డ్రన్స్ లైబ్రరీ, సిటీ బ్రాంచ్ లైబ్రరీ, మహిళా మరియు చిల్డ్రన్స్ గ్రంథాలయం, మరియు భీమునిపట్నం గ్రంథాలయాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి . భవన కేటాయింపునకు సంబంధించి తగు చర్యలు తీసుకోవాలని మరియు సంబంధిత అధికారులను ఆదేశిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రంథాలయాల ఆధునీకరణ ద్వారా నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు నాణ్యమైన సేవలందించడమే లక్ష్యమని చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ తెలిపారు.

## అదృశ్యమైన మైనర్ బాలిక.. క్షేమంగా ఇంటికీ

### కొద్ది గంటల్లోనే కేసు చేదించిన పోలీసులు.

**జయ జయహే - నర్సీపట్నం :**



ప్రభుత్వ వసతి గృహం వద్ద నుండీ అదృశ్యమైన మైనర్ బాలిక. ఫిర్యాదు అందిన కొద్ది గంటల్లోనే పోలీసులు అత్యంత వేగవంతంగా స్పందించి ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ సంఘటనపై నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ మాకవరపాలెం మండలం తామర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న మైనర్ బాలిక. ప్రభుత్వ వసతి గృహంలో కనిపించకపోవడంతో వసతి గృహానికి చెందిన వార్డెన్ తల్లిదండ్రులకు సమాచారం తెలియజేశారు. దీంతో తల్లిదండ్రులు మాకవరపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు అందిన వెంటనే మాకవరపాలెం ఎస్ఐ. దామోదర్ నాయుడు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా , డీఎస్పీ శ్రీనివాసరావుకు సమాచారం అందజేశారు. జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు డిఎస్పి శ్రీనివాసరావు సూచనలతో సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా దృశ్యాలను నిశితంగా పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారాలను వినియోగించి, ఐటీ కోర్ టిం సహకారంతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపడడం జరిగిందన్నారు. నిఘా బృందాల సమన్వయంతో మైనర్ బాలిక ఆచూకీని తూర్పుగోదావరి జిల్లా అన్నవరం గ్రామంలో ఉన్నట్లు గుర్తించి బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందన్నారు. ఈ కేసును అత్యంత వేగవంతంగా ఛేదించిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా , డిఎస్పి శ్రీనివాసరావు అభినందించారు. ఈ గాలింపు చర్యలు హెడ్ కానిస్టేబుల్ కృష్ణ , హెడ్ కానిస్టేబుల్ అప్పలరాజు, పోలీస్ కానిస్టేబుల్ నవీన్ కుమార్, బి.సి. నాయుడు, కొండబాబు తదితరులు కీలక పాత్ర పోషించారు.

## వారాహి దేవిగా కనకదుర్గ అమ్మవారు

**అనకాపల్లి జయ జయహే**



స్థానిక గవరపాలెం శతకం పట్టు వద్ద స్థాపించబడిన శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అష్టమి వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కే హరి నారాయణ ఉదయగిరి చంద్రశేఖర ఆధర్యంలో ఆషాడ మాసం పంచమి తిథి సందర్భంగా శ్రీ కనకదుర్గ అమ్మవారిని వారాహి దేవిగా ప్రత్యేక అలంకరణ గా చేసి అమ్మవారిని కళాత్మకంగా అలంకరించడం జరిగింది అలాగే ప్రత్యేక పూజలు నిర్వహించడం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదము స్వీకరించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ నిర్వాహకులు కాంద్రేగుల నాయుడు ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరిసెట్టి వరహా నూకరాజు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు మరియు గౌరీ పరమేశ్వరుల కమిటీ సభ్యులు, మరిడిమాంబ కమిటీ సభ్యులు, గౌరీ పరమేశ్వర ప్రజా టెంట్ హౌస్ తదితరులు ఈ కార్యక్రమ ఉత్సవంలో పాల్గొనడం జరిగింది

# 10 మంది గురుకుల విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డ్స్

**ఉమ్మడి జిల్లాల సమన్వయ అధికారి ఎస్ రూపవతి**

**విజయనగరం: (జయ జయహే)**

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు పదో తరగతి మరియు ఇంటర్ పరీక్షా ఫలితాల్లో విజయ దుందుభి మోగించారు. గురుకుల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వారికి అవార్డులను ఇస్తున్న సంగతి తెలిసిందే. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారిని మరింత ప్రోత్సహించేందుకు సైనింగ్ స్టార్స్ అనే కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ సైనింగ్ స్టార్స్ అవార్డులను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. ఈ క్రమంలో 2026 మార్చిలో జరిగిన పదోతరగతి మరియు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకి షైనింగ్ స్టార్స్ అవార్డులను అందజేయనుంది. ఈ మేరకు అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 10 మందికి ఈ షైనింగ్ స్టార్స్ అవార్డులు లభించాయి. 13స్కూల్స్‌కి చెందిన 10 మంది విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపిక అయ్యారని . ఉమ్మడి జిల్లాల సమన్వయ అధికారి ఎస్ రూపవతి వెల్లడించారు. ఈ నెల 20 వ తేదీన విజయనగరం జిల్లా ఇంచార్జ్ మినిస్టర్ వంగలపూడి అనిత మరియు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విజేతలు ఈ షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకోనున్నారు. అవార్డు అందుకోబోతున్న విద్యార్థులకు రూ.20,000 నగదు, ప్రశంసా పత్రము మరియు మెమొంటో ఇవ్వబడుతుంది అని కో ఆర్డినేటర్ ఎస్ రూపావతి వెల్లడించారు. ఈ సందర్భంగా ఈ షైనింగ్ స్టార్స్ అవార్డులు ఎంపికైన స్టూడెంట్స్‌ను మరియు టీచర్స్‌ను ప్రిన్సిపల్స్‌ను ఉమ్మడి జిల్లాల సమన్వయ అధికారి ఎస్ రూపవతి అభినందించారు.



# ముస్లిం సమాజానికి చిరకాల స్వప్నం సాకారం

**ముస్లిం షాదీ ఖానా మంజూరు చేసిన సీఎం**

**గుడివాడ జయ జయహే**

గుడివాడ పట్టణ ముస్లిం సమాజం ఎన్నో సంవత్సరాలుగా ఆకాంక్షిస్తూ వచ్చిన ముస్లిం షాదీ ఖానా నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుడివాడలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల ముస్లిం సమాజం అంతా ఆనందోత్సాహాలతో ఉప్పొంగిపోతోందని న్యాయవాది మరియు తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి షేక్ ముజాహిద్ పేర్కొన్నారు. ముస్లిం కుటుంబాల వివాహాలు, నిఖా కార్యక్రమాలు, మతపరమైన సమావేశాలు, సామాజిక సేవా కార్యక్రమాలు మరియు ఇతర కమ్యూనిటీ వేడుకలను సక్రమంగా నిర్వహించుకునే విధంగా అన్ని ఆధునిక వసతులతో ఈ షాదీ ఖానా నిర్మాణం జరుగనుండటం గుడివాడ ముస్లిం సమాజానికి గొప్ప వరంగా మారనుందని ఆయన తెలిపారు. ఇది కేవలం ఒక భవనం మాత్రమే కాకుండా, ముస్లిం సమాజ ఐక్యతకు, అభివృద్ధికి మరియు సాంస్కృతిక పరిరక్షణకు కేంద్ర బిందువుగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం, సామాజిక సమానత్వం మరియు సమగ్ర అభివృద్ధి పట్ల చూపుతున్న కట్టుబాటుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తుందని ముజాహిద్ పేర్కొన్నారు. గుడివాడ ముస్లిం సమాజం తరఫున ఈ ప్రాజెక్టును మంజూరు చేసిన ముఖ్యమంత్రి కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము ముస్లిం సమాజ అవసరాలను గుర్తించి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, నిరంతర ప్రయత్నాలతో ఈ గొప్ప లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించారని ఆయన ప్రశంసించారు. ఎమ్మెల్యే సేవలు ముస్లిం సమాజ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఈ సందర్భంగా గుడివాడ ముస్లిం పెద్దలు, మత గురువులు, మేధావులు, యువత మరియు మహిళల తరఫున ముఖ్యమంత్రి కి ఎమ్మెల్యే కు షేక్ ముజాహిద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, షాదీ ఖానా నిర్మాణ పనులు అత్యంత వేగంగా ప్రారంభమై, త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఈ ప్రాజెక్టు త్వరగా అమలులోకి వచ్చి, సమాజానికి ఉపయోగపడాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.





# జమ్మాదేవిపేటలో ఉచిత మెగా వైద్య శిబిరం

**మాడుగుల, జూలై 18 జయ జయహే**

ప్రజల ఆరోగ్యమే మా సంకల్పం – సేవయే మా మార్గం అనే నినాదంతో మాడుగుల మండలం, జమ్మాదేవిపేట సేవా వాలంటీర్ యూత్ ఆధ్వర్యంలో శనివారం అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. విశాఖ ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో మసకబారిన చూపుతో బాధపడుతున్న వారికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సకు అవసరమైన వారిని అనిల్ నీరుకొండ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ శిబిరంలో తగరపువలస అనిల్ నీరుకొండ హాస్పిటల్ గైనకాలజీ (స్త్రీల వైద్యం), ఆర్థోపెడిక్ (ఎముకలు/కీళ్ల నొప్పులు), జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల్లో నిపుణులైన వైద్యులు ఉచిత తనిఖీలు చేశారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులను హాస్పిటల్ బస్సులోనే తరలించి, ఉచిత ఆపరేషన్లు, మందులు భోజన వసతితో కూడిన ఉచిత చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. గుండె జబ్బులను ముందుగా గుర్తించే ఈసీజీ పరీక్షను కూడా పూర్తిగా ఉచితంగా నిర్వహించారు. ఈ శిబిరంలో నవరత్నం కేశవరావు ఫౌండేషన్ ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్ ద్వారా ప్రముఖ కంపెనీల నాణ్యమైన జెనరిక్ మందులను అతి తక్కువ ధరలకే ప్రజలకు అందుబాటులో ఉంచారు. మారుమూల పల్లెటూరులో యువత అంతా ఒక్కటై, ముందుకొచ్చి ఇలాంటి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం చాలా అభినందనీయమైన విషయమని పలువురు కొనియాడారు. జమ్మాదేవిపేట సేవా వాలంటీర్ యూత్‌ను ఆదర్శంగా తీసుకుని, పక్క గ్రామాల్లోని యువత కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలతో ముందుకు రావాలని స్థానికులు ఆకాంక్షించారు.




# రాజేంద్రపాలెంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం..

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ జులై 19**

పరిశుభ్రతతోనే మనం ఆరోగ్యంగా ఉండగలం. నిర్లక్ష్యం చేస్తే వ్యాధుల బారిన పడతాం అని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. శనివారం కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈశ్వరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణాలకే పరిమితమైన చెత్త ఇప్పుడు గ్రామాల్లోనూ కనిపిస్తోంది. అందుకే తడి, పొడి చెత్తను వేరు చేయడం ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. చెత్త నుంచి సంపద సృష్టించాలన్నది చంద్రబాబు నాయుడు ఆలోచన అన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నా ప్రజల్లో అవగాహన రావడం లేదు. ప్లాస్టిక్ వల్ల భూమితో పాటు మన ఆరోగ్యం కూడా నష్టపోతుంది. గతంలో మట్టికుండలు, క్యారియర్లు వాడేవారు. ఇప్పుడు ప్లాస్టిక్ ఎక్కువగా వాడటం వల్ల గిరిజన ప్రాంతాల్లో కూడా క్యాన్సర్ మరణాలు వస్తున్నాయి. కోవిడ్ తర్వాత హార్ట్ ఎటాక్ లు కూడా పెరిగాయి. అందుకే ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్లాస్టిక్ కి దూరంగా ఉండాలి అని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు నిధులు ఇచ్చిందని, ఈరోజు ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్మికులు చెత్తను తొలగిస్తున్నారని, స్వచ్ఛ రథాల ద్వారా సంపద సృష్టి కేంద్రాలకు పంపుతున్నారని తెలిపారు. అక్కడ తయారయ్యే ఎరువులతో వ్యవసాయంలో మంచి దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, రాష్ట్ర మహిళా కార్యదర్శి బొర్రా విజయరాణి, మండల మహిళా అధ్యక్షురాలు బోనంగి సత్యవతి, మేడిబోయిన సత్తిబాబు, నోంద్రు శ్రీను తో పాటు పలువురు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 20న రావణపల్లి సచివాలయంలో పీజీఆర్ఎస్...

**కలెక్టర్ ఆదేశాలతో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం..**

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ జులై 19,**

అల్లూరి జిల్లా కలెక్టర్ నిశాంతి ఆదేశాల మేరకు కొయ్యూరు మండలంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని మండల కేంద్రం నుంచి సచివాలయాలకు తరలించనున్నట్లు ఎంపీడీఓ ప్రసాదరావు తెలిపారు. ప్రతి సోమవారం ఒక సచివాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, వినతులు స్వీకరించనున్నట్లు వారు పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 20న సోవ-ంవారం రావణపల్లి సచివాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీఓ ఆదేశించారు. ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని, ప్రతి సచివాలయ పరిధిలోని ప్రజలు తమ సమస్యలతో నేరుగా అధికారులను కలవాలని కోరారు.






# డివైడర్‌ను ఢీ కొట్టినకారు

## ముగ్గురికి గాయాలు

**పూతలపట్టు, జూలై 18, జయ జయహే.**

పూతలపట్టు బైపాస్ రోడ్డు కిచ్చన్న గారి పల్లె వద్దశనివారం కారు డివైడర్ను ఢీ కొట్టడంతో కారు లో ప్రయాణిస్తున్నముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పూతలపట్టు మండలం కిచ్చన్నగారిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై వెళుతున్న కారు డ్రైవర్ నిద్ర మత్తు లోకి జారికో వడంతో ప్రమాదశీ చోటుచేసుకుంది. తిరుపతి నుంచి ముల్బాగల్ వైపు వెళ్తున్న కారు డ్రైవర్ నిద్ర మత్తుతో జారకోవడంతో అదుపుతప్పి డివైడర్ను ఢీ కొట్టింది. కారులో ఐదుగురు ప్రయాణిస్తుండగా, ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


# కాలం చెల్లిన వస్తువులతో కాసుల వ్యాపారం

**టెక్కలి మోర్ సూపర్ మార్కెట్లో నకిలీల దందా**

**మోర్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు**

**టెక్కలి జూలై 18 జయ జయహే**

టెక్కలిలో వినియోగదారు లను మాయ మాసం చేసి కాలం చెల్లిన నిత్యవసర వస్తువులు స్థానిక మోర్ సూపర్ మార్కెట్ ద్వారా నిత్యం అమ్మకాలు జరుపు తూ కాసుల పంట పండించుకుం టున్నారు మోర్ మార్కెట్ యాజమాన్యాలు. గ్రామీణ ప్రాంతాల వాసులు వస్తువుల ప్యాకెట్లపై నిర్ణీత తేదీలు చూడకుండా మోర్ మార్కెట్ సరుకులు కొనుగోలు చేసి చాలా మోసపోతున్నారు, మోర్ సూపర్ మార్కెట్ లో కాలం చెల్లిన నిత్యవసర సరుకుల దందాపై కొనుగోలు దారులు, అధికారులకు సమాచారం ఇవ్వడంతో, ఉన్నత అధికారుల ఆదేశాలతో మోర్ సూపర్ మార్కెట్ నిత్యవసర వస్తువులను ఫుడ్ సేఫ్టీ అధికారి జి శ్రీరాములు తనిఖీలు నిర్వహించి కొన్ని నమూనా వస్తువులను తీసుకుని హైదరాబాద్ ల్యాబ్ కు పంపిస్తామని, నిజ నిర్ధారణ జరిగిన వస్తువులపై చట్టపరమైన చర్యలు చేపడతామని శ్రీరాములు తెలిపారు, గతంలో కూడా టెక్కలి పట్టణంలో , రెస్టారెంట్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని వారిపై జరినమా , కేసులు నమోదు చేసినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీరాములు తెలిపారు.






# రెడ్డివారి గురువారెడ్డికి సన్మానం

**శ్రీకాళహస్తి, జులై 18,జయ జయహే**

గ్రంథాలయాల అభివృద్ధికి విశేష కృషి, విద్యాభివృద్ధి, సమాజ సేవ లను గుర్తిస్తూ ఇటీవల బెంగళూరుకు చెందిన భారత్ వర్చువల్ యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్న టిడిపి సీనియర్ నేత ,ఉమ్మడి జిల్లా గ్రంథాలయ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డిని శ్రీకాళహస్తి ప్రథమ శ్రేణి గ్రంథాలయ సుబ్బంది సన్మానించారు. శనివారం ఆయన గ్రంథాలయానికి విచ్చేసిన సందర్భంగా గ్రంథాలయ అధికారులు, బీడీసీ నిర్వాహకులు రీడర్స్ విద్యార్థులు శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి గ్రంథాలయ అధికారి లావణ్య, మరో గ్రంథాలయ అధికారి హరికృష్ణ, రీడర్స్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

**చోడవరం జులై 18 జయ జయహే**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకము నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, కళాశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రతి నెల" స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర" మూడవ శనివారం "పరిశుభ్రత పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనురాధ కళాశాల అన్ని గ్రూపుల విద్యార్థులు అధ్యాపకుల చేత "స్వచ్ఛతా ప్రతిజ్ఞ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆట స్థలము, పీజీ బ్లాకు, సైన్స్ ల్యాబ్స్, విద్యార్థినుల టాయిలెట్స్, కళాశాల గదులు పరిశుభ్రంగా తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర విద్యార్థులు పాల్గొని, ప్రజలకు అవగాహన కలిగించాలని ఉద్భవించారు. ఈ కార్యక్రమంలో ఐ క్యు ఏసి సమన్వయకర్త డాక్టర్ రాజేష్, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ రత్నభారతి, బి పిచ్చమ్మ, డి మాల్యాద్రి, డాక్టర్ లక్ష్మీ మంగమ్మ, డాక్టర్ సూర్యవతి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ లక్ష్మి డాక్టర్ పద్మావతి, డాక్టర్ మల్లి బాబు, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ నారాయణ, డాక్టర్ వెంకటేష్, రామలక్ష్మి, కోమల, హేమ గణేష్ ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు

# నిడదవోలు పురపాలక సంఘానికి రాష్ట్రస్థాయి గుర్తింపు

## సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకున్న కమిషనర్ టి. కృష్ణవేణి

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో భాగంగా, 50 వేల నుండి మూడు లక్షల లోపు జనాభా కలిగిన పురపాలక సంఘాల్లో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించి విశేష ప్రతిభ కనబరిచిన మూడు పురపాలక సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ ఎంపికలో నిడదవోలు పురపాలక సంఘం చోటు దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా గుడివాడలో నిర్వహించిన "స్వర్ణ



ఆంధ్రా -- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నిడదవోలు పురపాలక సంఘం కమిషనర్ టి. కృష్ణవేణి రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. నిడదవోలు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత కార్యక్రమాల అమలు, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించడం పట్ల స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు మరియు పురపాలక సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు పురపాలక సంఘం పరిశుభ్రత పట్ల చూపుతున్న నిబద్ధతకు నిదర్శనంగా నిలిచిందని అధికారులు పేర్కొన్నారు

# ఆహార కల్తీపై ఇక ఉక్కుపాదం

**ప్రజల ప్రాణాలతో చెలగామడితే కఠిన చర్యలు**

**ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం**

**ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం**

**సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు**

**వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలిన**

**అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన**

**ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం**

**హైదరాబాద్, (జయ జయహే)**

ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని



ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సమీక్షలో డిజిపి ఆనంద్, సిఎస్ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.



## నాలుగవ రోజుకు చేరిన నిరసన


**న్యాయం కోసం అక్క చెల్లెలు ఎదురుచూపు...**

**ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరుస్తారా లేదా..**

**బాధితులకు పూర్తి న్యాయం జరిగేది ఎప్పుడు...**

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ జులై 19.**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం లో ఇంకా న్యాయం కోసం అక్క చెల్లెలు చేస్తున్న నిరసన శనివారం నాలుగవ రోజుకు చేరుకుంది. అయినా సరే ఇప్పటివరకు అధికారులు మాత్రం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు అయితే శనివారం టీడీపీ నాయకులు ఎం.వి.వి. ప్రసాద్ , మాజీ జెడ్పీటీసీ. గాడి శ్రీరామ్మూర్తి, మండల ప్రెసిడెంట్ శ్రీ కాకూరు చందర్రావు. శ్రీ దుచ్చరి చిట్టిబాబు. రాజేంద్రపాలెం సర్పంచ్ శ్రీ పీక సింహాచలం మరియు టిడిపి సీనియర్ నాయకుడు బకీర్ ఖాన్ బాధితులను పరామర్శించారు. అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్న వారు, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని పై అధికారులను డిమాండ్ చేశారు అయితే బాధితులకు న్యాయం జరుగుతుందా లేదా అనేది చూడాలి..



## వేడుకగా శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి వార్ల పురావిహారం

**శ్రీకాళహస్తి, జులై 18,జయ జయహే**

**శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధాలయమైన శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి వారి బ్రహ్మోత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం ఉత్సవ ముట్లు ఊరేగింపు చేశారు. రాత్రి స్వామి అమ్మవార్ల ను పుర వీధుల్లో విహారింప చేశారు.**

## పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన గంటా

**విశాఖపట్నం, జులై 18: (జయ జయహే)**


భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం హైదరాబాద్ లో మర్యాదపూ-ర్వకంగా కలిసి పరామర్శించారు. వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. తాజా రాజకీయ పరిస్థితుల గురించి ముచ్చటించారు.



## వాయిదా పడ్డ కళాశాల భవనాలు ప్రారంభం

**మాడుగుల, జులై 18 జయ జయహే**

ఈనెల 19వ తేదీన నిర్వహించ తలపెట్టిన నాలుగుర ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాలు ప్రారంభోత్సవ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తదుపరి కార్యక్రమం నిర్వహించే తేదీ, సమయం త్వరలో తెలియజేస్తామని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పి లక్ష్మినారాయణ తెలిపారు.






## సాంకేతికతపై మరింత పట్టు మరింత పట్టు సాధించాలి

**అనకాపల్లి జయ జయహే**

మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను జోడించుకుని పోలీస్ సేవలను ప్రజలకు మరింత వేగంగా పారదర్శకంగా అందించాలని అనకాపల్లి జిల్లా ఆదరణపు ఎస్పీ ఎల్ మోహన్ రావు పిలుపునిచ్చారు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఐటి కోర్ ఆధ్వర్యంలో సిసిటి ఎన్ఎస్ ఆపరేటర్లకు ఒకరోజు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించడం జరిగింది . జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా వారి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్పి మోహన్ రావు మాట్లాడుతూ డేటా నమోదులో వేగం కచ్చితంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైమ్ రికార్డులు ఎఫ్ఐఆర్ నమోదు నిందితుల వివరాలను సిసిటిఎన్ఎస్ సాఫ్ట్వేర్ల లో ఎప్పటికప్పుడు ఎలాంటి తప్పులు లేకుండా అప్డేట్ చేయాలని ఆయన పేర్కొన్నారు టెక్నాలజీ పై ఆపరేటర్లు సరికొత్త సాంకేతిక మార్పులపై నిరంతరం అప్డేట్ అవ్వాలని అప్పుడే కేసులు దర్యాప్తుల క్షేత్రస్థాయి అధికారులకు వేగంగా సమాచారం అందుతుందని ఆయన స్పష్టం చేశారు ఈ శిక్షణ శిబిరంలో సైబర్ క్రైమ్ అండ్ సోషల్ మీడియా ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ ఐటీ కోర్ ఎస్సై సురేష్ బాబు ఆపరేటర్లకు పలు సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారు సి సి టి ఎన్ ఎస్ సాఫ్ట్వేర్ల వచ్చిన సరికొత్త అప్డేట్స్ మరియు ఫీచర్లు ఎలా ఉపయోగించాలో లైవ్ డెమో ద్వారా వాళ్ళకి వివరించడం జరిగింది సాయి గారు నేరాల డేటా బేస్ నిర్వహణ సోషల్ మీడియా మానిటరింగ్ డేటాను సిస్టంలో భద్రపరిచే విధానాలపై ఆపరేటర్లకు ఉన్న సందేహాలను వారు నివృత్తి చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా అన్ని పోలీస్ స్టేషన్ కు చెందిన సిసిటిఎన్ఎస్ ఆపరేటర్లు ఐటి కోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను వెంటనే నియమించాలి

**తల్లిదండ్రుల విజ్ఞప్తి**

**కరీంనగర్, జూలై 18(జయ జయహే)**

కరీంనగర్ డాక్టర్ స్ట్రీట్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో లో ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. పాఠశాలలో ప్రస్తుతం ఫిజిక్స్, బయాలజీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులకు రెగ్యులర్ ఉపాధ్యాయులు లేరని తల్లిదండ్రులు తెలిపారు. కొన్ని తరగతుల్లో డిజిటల్ పాఠాలు చూపిస్తున్నప్పటికీ, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులకు అర్హత కలిగిన సబ్జెక్టు ఉపాధ్యాయుల ప్రత్యక్ష బోధన, సందేహాల నివృత్తి అత్యంత అవసరమని పేర్కొన్నారు. విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫిజిక్స్, బయాలజీ, మ్యాథమెటిక్స్ ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ను తల్లిదండ్రులు కోరారు. ఈ సమస్యపై విద్యాశాఖ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఒంటరి పురుషుడు అంటే ప్రభుత్వానికి చిన్న చూపా

**డాక్టర్ నాడిశెట్టి శాంతారావు**

**విజయనగరం జూలై '18 (జయ జయహే)**



2025-2026 సంవత్సరం నకు గాను ప్రధాన మంత్రి కోటా కింద ఇళ్ళు లేని వారికి ఇళ్ళు పొందేందుకు దరఖాస్తులు కోరగా..ఆన్లైన్లో " ఒంటరి పురుషుడు" నకు ఇళ్ళు మంజూరుకు అవకాశం లేదు అంటూ దరఖాస్తులో పొందుపరిచారు. ఇది నిజంగా ఎంత దుర్మార్గం ఆలోచనలు చేయాలని డాక్టర్ నాడిశెట్టి శాంతారావు కేంద్రం, ఏపీ రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిపారు. ఈ ఒంటరి పురుషుడు 'ఓటు' వేయడానికి, ప్రభుత్వ ప్రచారానికి మాత్రమే పనికొస్తాడా? అటువంటప్పుడు రాజకీయ ఎన్నికల్లో కూడా పోటీ చేసేందుకు ఒంటరి పురుషుడు కు అవకాశం ఇవ్వకూడదు అని శాంతారావు తెలిపారు . నిజానికి 'ఒంటరి పురుషుడు' గా ఉండటానికి గల కారణాలు అనేకములు... అందుకు అనేక ఉదాహరణలు: తల్లిదండ్రులు మరణాంతరం కుటుంబ భారం పడుతుంది. ఈ రీతిగా ఆడపిల్లలు సంరక్షణలో భాగంగా వారి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే క్రమంలో వయసు మీరడం తదుపరి ఆర్థిక పరమైన సమస్యలు ఉత్పన్నం కావచ్చు ' ఒంటరి పురుషుడు' గా మిగిలి పోతున్నాడు. మరో కోణంలో చూస్తే వివాహేతర సంబంధం మూలంగా పెండ్లి చేసుకున్నా తనని విడిచి పెట్టి భార్య వేరొకరితో వెళ్లిపోవడం కూడా ఆ కోవకే వస్తుంది. కుటుంబంలోని చిన్న పిల్లలు కల్గి ఉన్నప్పుడు భార్య అనారోగ్యానికి గురియై మరణించిన కూడా ఆయన 'ఒంటరి పురుషుడు' గానే మిగిలిపోతాడు. ఇలా అనేక కారణాలు చేత ' ఒంటరి పురుషుడు ' తాను సమాజంలో మానసికంగా కృంగి పోతున్నప్పుడు అటువంటి ఒంటరి పురుషుడు నకు కేంద్రం, ఏపీ రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవడం పోయి, ప్రభుత్వ పథకాలు మంజూరు విషయంలో మొండి చేయి చూపడం అన్యాయం అంటూ, ఈ విషయాన్ని కేంద్రం, ఏపీ రాష్ట్ర ప్రభుత్వాలు క్షుణ్ణంగా పరిశీలించి వీలైనంత వరకు ప్రతి ప్రభుత్వ పథకాల కు అర్హత మేరకు మంజూరు చేసి అమలుకు తగు చర్యలు తీసుకోవాలని.. ఇందుకు ప్రభుత్వ 'జీవో ' జారీ చేయాలని శ్రీ గోపినాథం సాంస్కృతిక సేవా సంస్థ ఛైర్మన్ డాక్టర్ నాడిశెట్టి శాంతారావు డిమాండ్ చేస్తూ లేఖలను మెయిల్ ద్వారా పంపారు.



## డాక్టర్ మురళీ మోహన్ సామాజిక వైద్య సేవలు అజరామరం

**రాజనాథ్ సింగ్, భారత రక్షణ శాఖ మంత్రి**

**ఢిల్లీ (జయ జయహే)**

డాక్టర్ మురళీ మోహన్ సామాజిక వైద్య సేవలు అజరామరం అని భారత రక్షణ శాఖ మంత్రి రాజేంద్ర సింగ్ అన్నారు. శనివారం ఉదయం ఢిల్లీ మహా నగరం లో సిజిఓ కాంప్లెక్స్, సన్ సద్ మార్గ్ న్యూ ఢిల్లీలోని కానిస్టట్యూషన్ క్లబ్ లో భారత జాతీయ వైద్యుల సంఘం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మురళీ మోహన్ కు ప్రతిష్టాత్మక కమ్యూనిటీ సర్వీస్ అవార్డు విభాగంలో అవార్డు ను అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ మురళీ మోహన్ సామాజిక వైద్య సేవలు మరువలేనివి అని వివరించారు . ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మయాంక్ భాయ్ జె. నాయక్ , ఈ కార్యక్రమానికి ఐఎం ఎ అధ్యక్షులు డా. అనిల్ జె. నాయక్ అధ్యక్షత వహించారు, డాక్టర్ దిలీప్ బన్సాలియా డాక్టర్ సరాసరి దత్తా, పియూష్ జైన్ తదితరులు పాల్గొని మాట్లాడారు. డాక్టర్ మురళీ మోహన్ మాట్లాడుతూ తాను నిర్వహిస్తున్న సేవలు గుర్తించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు.



# టేస్టీ.. హెల్తీ.. కర్బూజా స్మూతీ

**డ్రై ఫ్రూట్స్ తినడానికి ఎంత టేస్టీగా ఉంటాయో.. వీటి వల్ల బెనిఫిట్స్ కూడా అన్నీ ఉంటాయి. వీటిని స్మూతీలా చేసుకుని తీసుకుంటే బరువు తగ్గడానికి హెల్ప్ చేస్తుంది. ఈ ఫ్లేవర్‌ని కూడా చాలా మంది ఇష్టపడతారు. ఇది ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు ఎన్నో లాభాలని అందిస్తుంది. మరి దీనిని ఎలా చేయాలి. తాగడం వల్ల ఏయే లాభాలో తెలుసుకోండి.**

**కావాల్సిన పదార్థాలు..**

**పండిన అరటిపండు 1**
1 కప్పు పాలు
2 టేబుల్ స్పూన్ల ఆల్మండ్ బటర్
1 టేబుల్ స్పూన్ తేనె
గుప్పెడు డ్రై ఫ్రూట్స్
కొన్ని ఐస్‌క్యూబ్స్

**ఖర్బూజా స్మూతీ..**

**తయారీ విధానం..**
ముందుగా అరటిపండు తొక్కని తీసి చిన్న ముక్కలుగా కట్ చేయండి.
ఇందులో పాలు, ఆల్మండ్ బటర్, తేనె, డ్రై ఫ్రూట్స్, ఇష్టమనుకుంటే ఐస్‌క్యూబ్స్ వేసి బ్లెండ్ చేయండి.
దీనిని మంచి టెక్చర్ వచ్చేవరకూ బ్లెండ్ చేయండి.
దీనిని ఓ గ్లాస్‌లో వేసి పై నుంచి డ్రైఫ్రూట్స్ తురుముని వేసి ఎంజాయ్ చేయడమే.

**దీని వల్ల కలిగే లాభాలేంటో తెలుసుకోండి.**
గట్ హెల్త్..
ఈ స్మూతీలో హై ఫైబర్ ఉంటుంది. దీంతో మీకు డైజెషన్ ప్రాబ్లమ్స్ దూరమవుతాయి. బ్లోటింగ్, అసిడిటీ, గ్యాస్ సమస్యలు తగ్గుతాయి.
ఇమ్యూనిటీ..
ఈ డ్రై ఫ్రూట్స్‌లో నేచురల్ షుగర్స్ ఉంటాయి. అవే ఫ్రక్టోస్. అదే విధంగా విటమిన్స్, మినరల్స్ అన్నీ కూడా ఇన్‌స్టంట్‌గా శక్తిని అందిస్తాయి. అదే విధంగా ఇవి మీ ఇమ్యూనిటీనీ పెంచుతాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ మీకు ఎలాంటి ఆరోగ్యా సమస్యలు రాకుండా కాపాడతాయి.

**బరువు తగ్గడం..**
ఈ స్మూతీని తాగడం వల్ల మన టేస్టీ బడ్స్ సాటిస్‌ఫై అవుతాయి. దీంతో ఎక్కువగా తినరు. హెల్దీ వెయిట్‌ని మెంటెయిన్ చేయొచ్చు. ఇందులో ఎండుద్రాక్ష, ఖర్జూరాలు, ఆప్రికాట్స్ ఉంటాయి. ఇవన్నీ ఎక్కువగా తియ్యగా ఉంటాయి. దీంతో పంచదార కలపాల్సిన అవసరం లేదు. ఇందులో ఫైబర్ కంటెంట్ ఉంటుంది. దీని వల్ల చాలా సమయం వరకూ కడుపు నిండుగా ఉంటుంది. ఆకలి అవ్వదు. వీటిని తీసుకోవడం వల్ల క్రేవింగ్స్ కూడా కంట్రోల్ అవుతాయి. దీనిని తీసుకోవడం వల్ల వెయిట్‌లాస్‌కి హెల్ప్ అవుతుంది. మీరు వీటిని తీసుకున్నప్పుడు కేలరీలని కూడా గుర్తుంచుకోవాలి. ఇందులోని హెల్దీ ఫ్యాట్స్ మీ బరువుని తగ్గిస్తాయి.

**బ్రెయిన్ హెల్త్..**
ఈ స్మూతీనిని తీసుకోవడం వల్ల బ్రెయిన్ హెల్త్ కూడా మెరుగవుతంది. ఈ నట్స్‌లో ఎక్కువగా ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, మినరల్స్ ఉంటాయి. ఇవన్నీ కూడా బ్రెయిన్ హెల్త్‌ని కాపాడతాయి. ఇన్ని లాభాలున్న స్మూతీని మీరు కచ్చితంగా ట్రై చేయండి.

# మందార పువ్వుల టీతో.. ఆరోగ్యకర ప్రయోజనాలు



హైబిస్కస్ టీ.. దీనిని రోసెల్లే టీ లేదా సోర్రెల్ టీ అని కూడా పిలుస్తారు. అదేనండి మన తెలుగు భాషలో మందార పువ్వుల టీ. ఇది మందార పువ్వు ఎండిన రేకుల నుండి తయారు చేయబడిన ఒక ప్రసిద్ధ మూలికా పానీయం. ఇది పుల్లని, రిఫ్రెష్ రుచిని కలిగి ఉంటుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా చాలా మందికి ఇష్టమైన పానీయంగా మారుతుంది. దాని రుచికరంతో పాటు, మందార టీ అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. మరి వాటి వివరాలు ఒకసారి చూస్తే..

**యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి:**
మందార టీ ముఖ్య ప్రయోజనాల్లో ఒకటి దాని అధిక యాంటీఆక్సిడెంట్ కంటెంట్. యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడతాయి. ఇవి గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దారితీసే హానికరమైన అణువులు. మందార టీని క్రమం తప్పకుండా తాగడం వల్ల శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి, వాపును తగ్గించవచ్చు.

**రక్తపోటును తగ్గిస్తుంది:**
మందార టీ రక్తపోటు స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుందని అనేక అధ్యయనాలు చూపించాయి. ఇది శరీరానికి అదనపు సోడియం, నీటిని విసర్జించడానికి సహాయపడుతుంది. రక్త పరిమాణాన్ని తగ్గించడం ద్వారా మందార టీ ధమనుల గోడలపై ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. తద్వారా రక్తపోటు, ఇతర హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**బరువు తగ్గడానికి సహాయపడుతుంది:**
హైబిస్కస్ టీ బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. ఇది జీవక్రియను పెంచడానికి, కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది. ఇది ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామ దినచర్యకు గొప్ప అదనంగా ఉంటుంది. అదనంగా, మందార టీ లక్షణాలు ఉబ్బరం, నీటిని నిలుపుకోవడాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. తద్వారా మీరు సన్నగా కనిపిస్తారు. మంచి అనుభూతి చెందుతారు.

**జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది:**
మందార టీని క్రమం తప్పకుండా తాగడం వల్ల జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది అధిక ఫైబర్ కంటెంట్ కారణంగా అజీర్ణం, ఉబ్బరం, మలబద్ధకాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. మందార టీ దాని శోథ నిరోధక లక్షణాలకు కూడా ప్రసిద్ధి చెందింది. ఇది జీర్ణ వ్యవస్థను ఉపశమనం చేయడానికి మరియు అసౌకర్యాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది:**
మందార టీలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన రోగనిరోధక వ్యవస్థకు అవసరమైన పోషకం. విటమిన్ సి తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచడానికి సహాయపడుతుంది. ఇవి అంటువ్యాధులు, వ్యాధులతో పోరాడటానికి బాధ్యత వహిస్తాయి. మందార టీని క్రమం తప్పకుండా తాగడం వల్ల మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, ఏడాది పొడవునా మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది.

# గులాబ్ జామూన్ పౌడర్‌తో కేక్



చాలా మందికి గులాబ్ జామ్స్ అంటే చాలా ఇష్టం. ఒక దాని తర్వాత మరొకటి లాగించేస్తారు. గులాబ్ జామ్స్ ఐస్ క్రీమ్స్‌తో తిన్నా చాలా రుచిగా ఉంటాయి. ఇలా గులాబ్ జామ్స్ అంటే చాలా మందికి ఇష్టం.

గులాబ్ జామ్స్ తయారు చేసే పొడితో మనం కేక్ కూడా తయారు చేసుకోవచ్చు. అది కూడా ఎగ్ లేకుండా. ఎగ్ లేకుండా చేసే కేక్ ఎప్పుడైనా సరే తినవచ్చు. గులాబ్ జామ్స్‌తో తయారు చేసే కేక్ కూడా చాలా రుచిగా ఉంటుంది. సింపుల్‌గా కూడా చేసుకోవచ్చు. మరి గులాబ్ జామ్స్ పౌడర్‌తో చేసే కేక్ ఎలా తయారు చేస్తారు? దీనికి కావాల్సిన పదార్థాలు ఏంటో ఇప్పుడు చూద్దాం.

**గులాబ్ జామ్ కేక్‌కి కావాల్సిన పదార్థాలు:**
గులాబ్ జామ్ పౌడర్, మైదా, చక్కెర, పెరుగు, నెయ్యి, పాలు వెనీలా ఎసెన్స్, రోజ్ ఎసెన్స్, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, కుంకుమ పువ్వు, యాలకుల పొడి.

**గులాబ్ జామ్ కేక్ తయారీ విధానం:**
ముందుగా పంచదారను మిక్సీలో వేసి పౌడర్‌లా చేసుకోవాలి. ఆ తర్వాత అర కప్పు పెరుగు పంచదార పొడిలో వేసుకోవాలి. ఇందులో పావు కప్పు నెయ్యి వేయాలి. ఈ మూడు ఉండలు లేకుండా.. బాగా కలిసి పోయేలా బీట్ చేసుకోవాలి. ఆ తర్వాత ఇందులో పాలు కూడా పోసి మళ్లీ మిక్స్ చేసుకోవాలి. ఇప్పుడు గులాబ్ జామ్ పౌడర్, మైదా తీసుకుని రెండింటినీ జల్లించుకోవాలి. ఇప్పుడు ఈ చల్లించుకున్న పొడిని కూడా పంచదార మిశ్రమంలో వేసి మరోసారి బాగా బీట్ చేసుకోవాలి. మొత్తం అన్నీ చక్కగా మిక్స్ అయిపోవాలి. అప్పుడే కేక్ చక్కగా పొంగి, మెత్తగా వస్తుంది. ఆ నెక్ట్స్ రోజ్ ఎసెన్స్, వెనిలా ఎసెన్స్, బేకింగ్ సోడా, బేకింగ్ పౌడర్, యాలకుల పొడి కూడా మళ్లీ మిక్స్ చేసుకోవాలి.

ఇప్పుడు కేక మౌల్డ్ తీసుకుని.. నెయ్యి లేదా బటర్ రాసుకోవచ్చు. అందులోనే ఒక స్పూన్ మైదా పిండి చల్లించి.. మౌల్డ్ ని కోట్ చేయాలి. ఇప్పుడు కేక్ మిశ్రమాన్ని మౌల్డ్‌ల వేసి.. ఓవెన్‌లో 170 డిగ్రీల ప్రీ హీట్‌లో 40 నిమిషాలు కుక్ చేసుకోవాలి. కేక్ అయిపోయిన తర్వాత తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మళ్లీ కొద్దిగా పంచదార తీసుకుని స్టవ్ మీద పెట్టి.. కరగనివ్వాలి. ఇందులో కొద్దిగా కుంకుమ వ్వు వేసుకోవాలి. పంచదార బాగా కరిగాక.. ఈ సిరప్‌ని కేక్‌పై వేయాలి. అంతే ఎంతో రుచిగా ఉండే గులాబ్ జామ్ పౌడర్ కేక్ సిద్ధం. ఇది పిల్లలకు ఖచ్చితంగా నచ్చుతుంది.

# జుట్టు ఎక్కువగా రాలుతోందా?

హెయిర్ ఫాల్. నూటికి 90 శాతం మంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఇది ఒకటి. చిన్న, పెద్ద తేడా లేదు. మూడుపదుల వయసైనా నిండకుండానే జుట్టు రాలిపోయి.. బట్టతల అవుతుంది. పట్టణాలు, మెట్రో సిటీల్లో ఉండే వారికైతే ఈ సమస్య అధికంగా ఉంటోంది. జుట్టురాలడం తగ్గాలని రకరకాల షాంపూలు, నూనెలు వాడుతుంటారు. వాటి వల్ల హెయిర్ ఫాల్ మరింత పెరుగుతుందే తప్ప ఫలితం
ఉండదు. చాలామంది.. మేం చిన్న పిల్లలుగా ఉన్నపుడు మా జుట్టు చాలా బాగుండేది. ఇప్పుడేమో కొత్తమీర కట్టలాగా తయారైందని వాపోతుంటారు. తేడా ఏంటంటే.. అప్పుడు అంతా అమ్మ చేసిన వంట తినేవారు. ఇప్పుడేమో ఫాస్ట్ ఫుడ్స్, బిర్యానీలు, పిజ్జాలు, బర్గర్లు, కేక్‌లు, వగైరా ఆహారాలు తింటున్నారు. వాటిలో వాడే హైలీ ఫ్యాటెడ్ కంటెంట్ శరీరానికి ఏ మాత్రం మంచిది కాదు. బయట మార్కెట్లో దొరికే షాంపూలకు బదులుగా కుంకుడుకాయలు వాడటం అలవాటు చేసుకోండి. అలాగే కెమికల్స్‌తో తయారు చేసిన సీరమ్ కు బదులుగా మీ ఇంట్లోనే హెయిర్ సీరమ్ తయారు చేసుకుని వాడండి. జుట్టు ఆరోగ్యంగా, షైనీగా ఉండటంతో పాటు రాలడం తగ్గి.. పెరుగుతుంది.

**హెయిర్ ఫాల్ ను తగ్గించే సీరమ్**

**తయారీకి కావలసిన పదార్థాలు**

నీరు -1 గ్లాసు
బియ్యం -1 టీ స్పూన్
అవిసె గింజలు -1 టీ స్పూన్
మెంతులు -1 టీ స్పూన్
కరివేపాకు -10-12 ఆకులు

**తయారీ విధానం**
స్టవ్ పై ఒక గిన్నెను పెట్టుకుని అందులో గ్లాస్ నీరు పోయాలి. ఇప్పుడు పైన చెప్పిన పదార్థాలను ఆ క్వాంటిటీలో ఒక్కొక్కటిగా వేసి.. 5 నిమిషాల పాటు మరిగించుకోవాలి. ఈ నీటిని వడకట్టుకుని 1 టీ స్పూన్ కొబ్బరినూనెను వేసి కలుపుకోవాలి. అంతే హెయిర్ ఫాల్ కంట్రోల్ సీరమ్ రెడీ. ఈ సీరమ్ ను డ్రై హెయిర్ పై అప్లై చేసుకుని అలాగే ఉంచుకోవాలి. మీకు నచ్చకపోతే ఆరిపోయాక వాష్ చేసుకోవచ్చు. ఇలా వారానికి 2 సార్లు చొప్పున చేస్తే.. హెయిర్ ఫాల్ క్రమంగా తగ్గి.. జుట్టు పెరుగుతుంది.





Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com